www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, 04.05.2024
హైదరాబాద్
సంపుటి: 2, సంచిక: 203

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# రోహిత్ వేముల కేసు క్లోజ్



- అప్పారావు, దత్తాత్రేయ ఎన్ రామచందర్ రావు, స్మృతీ ఇరానీని కేసు నుంచి తప్పించిన పోలీసులు
- రోహిత్ వేముల ఎస్సీ కాదని తేల్చిన పోలీసులు
- లోక్ సభ ఎన్నికల ముందు సంచలన పరిణామం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రోహిత్ వేముల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రోహిత్ వేముల కేసును తెలంగాణ పోలీసులు మూసివేశారు. ఈ కేసు నుంచి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ వీసీ అప్పారావుతో పాటు అప్పటి సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ, మిగతా 2లో





# గుజరాత్‌లో ఉన్నోళ్లే మనుషులా?

- తెలంగాణలో ఉన్నోళ్లు కాదా..
- బీజేపీ ముమ్మాటికి రిజర్వేషన్ ఎత్తేస్తుంది
- కులగణన చేపట్టి రిజర్వేషన్ ఇవ్వాలని కాంగ్రెస్ భావించింది
- కానీ బీజేపీ దానికి అడ్డం పడింది
- మోడీ వాట్సాప్ వర్సిటిలో అన్నీ తప్పుడు ప్రచారాలే...
- కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలన్నది కాంగ్రెస్ విధానం
- సీఎం రేవంత్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రిజర్వేషన్లే ప్రధాన అంశంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ధర్మపురిలో నిర్వహించిన జనజాతర సభలో సీఎం ప్రసంగించారు. నేతకాని కార్పొరేషన్, సింగరేణి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. పోటీ చేసే అభ్యర్థి లేక ..ధర్మపురి ప్రజలు తిరస్కరించిన కొప్పుల ఈశ్వర్‌నే మళ్లీ ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నిలబెట్టిందని ఆక్షేపించారు. బీజేపీ నేతలు నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మోదీ వాట్సాప్ వర్సిటీలో అన్నీ అబద్ధాలే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పదేళ్లు దేశ ప్రధానిగా ఉన్న మోదీ, ఐదేళ్లు కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విభజనచట్టంలో సోనియాగాంధీ ఇచ్చిన బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని కాలగర్భంలో కలిపేశారన్నారు. కాజీపేటకు ఇచ్చిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని లాతూర్‌కు తరలించుకుపోయారని ఆరోపించారు. ''నాలుగువేల మెగావాట్ల సామర్థ్యంలో ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి సంస్థను నిర్మించాల్సింది. పదేళ్లలో 1600 మెగావాట్లతో నిర్మించారు. రంగారెడ్డి జిల్లాకు ఐటీఐఆర్ కారిడార్‌ను సోనియాగాంధీ ఇస్తే దానిని రద్దు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించకుండా మొండి చేయి చూపించారు. గిరిజన యూనివర్సిటీ, ఐఐటీ, ఐఐఎం ఇలా చెప్పుకొంటూ పోతే పెద్ద జాబితానే ఉంది. గుజరాత్‌కు మాత్రం బుల్లెట్ రైలు, సబర్మతి రివర్ ఫ్రంట్ తీసుకెళ్లారు. రూ.లక్ష కోట్ల నిధులు తరలించుకు పోయారు. గుజరాత్‌లో ఉన్నవారేనా? తెలంగాణలో‌ఉన్న వాళ్లు మనుషులు కాదా? ఈ రాష్ట్రంపై భాజపా నేతలు సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారు. కులగణన చేపట్టి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పెంచాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ కుట్ర చేస్తోంది. 400 సీట్లు గెలిస్తే లోక్‌సభలో మూడో వంతు మెజార్టీతో రిజర్వేషన్లు రద్దు చేస్తారు. రిజర్వేషన్ల రద్దుకు దేశంలోని 50శాతం రాష్ట్రాలు ఆమోదించాలి. అందుకే 8 రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలను పడగొట్టి భాజపా ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నారు. భాజపాకు ఓటు వేస్తే రిజర్వేషన్ల రద్దుకు ఉపయోగపడుతుంది. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రిజర్వేషన్లు పెంచేందుకు దోహదపడుతుంది'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# సింగరేణిపై పెద్ద కుట్ర

- మోడీతో కలిసి రేవంత్ పన్నాగం
- సింగరేణిని నష్టాల పాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే
- మేం అధికారంలోకి వచ్చాక లాభాల బాట పట్టించాం
- గోదావరిని తమిళనాడుకు తరలించుకుపోయేందుకు కుట్ర
- ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నాడు?
- బీజేపీకి 200 సీట్లకు మించి రావు
- కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమే
- అప్పుడు బీఆర్ఎస్ దే కీలక పాత్ర
- బస్సుయాత్రలో కేసీఆర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

సింగరేణి పై చాలా పెద్ద కుట్ర జరగబోతుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామగుండంలో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. మంచిగ ఉన్న సింగరేణిని ఒకప్పుడు ముంచిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఇప్పుడు మరోసారి నరేంద్ర మోదీతో కలిసి రేవంత్ రెడ్డి సింగరేణిని ముంచేందుకు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు దీని గురించి ఆలోచించాలని..కార్మికుల పక్షాన ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. మంచిగ ఉన్న సింగరేణిని ఒకప్పుడు ముంచిందే కాంగ్రెస్ పార్టీ అని కేసీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పులు తెచ్చి సింగరేణిని నష్టాల్లోకి పంపించి.. దాన్ని ముంచగొట్టిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. వాస్తవానికి సింగరేణి మన తెలంగాణ ఆస్తి అని.. వంద శాతం మనకే ఉండేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పు తెచ్చి సింగరేణిని నష్టాల్లోకి పంపించి.. ఆ అప్పు తిరిగి చెల్లించలేక 49 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పిందే ఈ దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ పార్టీ చరిత్ర అని పేర్కొన్నారు. అదే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికులకు ఎన్నో లాభాలు తెచ్చామని తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి.. 19 వేల మంది పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చామని.. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్ )పేరు మీద మెడికల్ కాలేజీ పెట్టుకున్నాం. ఆ మెడికల్ కాలేజీలో ఐదు శాతం కార్మికుల పిల్లలకే సీట్లు వచ్చేలా చేసుకున్నామని తెలిపారు. కానీ ఇప్పుడు సింగరేణికి పెద్ద ప్రమాదం రాబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని నదులను కేంద్రానికి అప్పజెబుతుంటే ఈ ముఖ్యమంత్రి సప్పుడు జేయడని కేసీఆర్ విమర్శించారు. కృష్ణానదిని తీసుకెళ్లి కేఆర్ఎంబీకి అప్పజెప్పిండని అన్నారు. ఇచ్చంపల్లి దగ్గర ప్రాజెక్ట్ కట్టి గోదావరి నీటిని తమిళనాడు, మిగతా 2లో

## తెలంగాణకు ఐదు న్యాయాలు

- కాంగ్రెస్ ప్రత్యేక మేనిఫెస్టో
- విడుదల చేసిన దీపాదాస్ మున్షీ, మంత్రి శ్రీధర్‌బాబు
- ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పటిష్ఠమైన చర్యలు
- గడప గడపకూ మేనిఫెస్టోను తీసుకెళ్లాలి
- మంత్రి శ్రీధర్‌బాబు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



తెలంగాణ ప్రత్యేక మేనిఫెస్టోను కాంగ్రెస్ విడుదల చేసింది. ఐదు న్యాయాలు, తెలంగాణకు ప్రత్యేక హామీల పేరుతో మేనిఫెస్టో తెలుగు ప్రతిని రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ విడుదల చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు. రాష్ట్ర అవసరాలు ఆలోచించి మరీ మేనిఫెస్టో తయారు మిగతా 3లో

## కాంగ్రెస్ అంటే కరువు, కరప్షన్

- చెయ్యి గుర్తుకు బదులు గాడిద గుడ్డు గుర్తు
- ఆరు గ్యారెంటీలు అమలైనట్లు బోర్డులు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వివరాలు 2లో



## బీఆర్ఎస్‌కు మరో షాక్

- ఎమ్మెల్సీ దండె విఠల్ పై అనర్హత వేటు
- ఆయన ఎన్నిక చెల్లదంటూ కాంగ్రెస్ పిటిషన్
- ఫోర్జరీ సంతకంతో ప్రత్యర్థి నామినేషన్ విత్ డ్రా చేయించడమే కారణం
- గులాబీ పార్టీకి తగ్గిన మరో సీటు



వివరాలు 2లో

# రాయ్ బరేలీ నుంచి రాహుల్ నామినేషన్

- ఉత్కంఠకు తెర
- అమేథీ నుంచి పోటీ చేస్తారని జోరుగా ప్రచారం
- కానీ అక్కడి నుంచి కిశోర్ లాల్‌కు చాన్స్
- బీజేపీ లీడర్ల విమర్శలు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్ బరేలీ నుంచి ఎంపీగా నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. రాహుల్ వెంట సోనియా గాంధీ, సోదరి ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాబర్ట్ వాద్రా ఉన్నారు. సోనియా గాంధీ రాజ్యసభకు ఎంపిక కావడంతో రాయ్ బరేలీ నుంచి ఈ సారి రాహుల్ పోటీ చేస్తున్నారు. రాయ్‌బరేలీ నుంచి దినేష్‌ప్రతాప్ సింగ్‌ను బీజేపీ పోటీకి దింపింది. మరో వైపు అమేథీ నుంచి కిశోరీ లాల్ శర్మ నామినేషన్ వేశారు. ఈ రెండు స్థానాలకు మే 20న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లకు ఇవాళ లాస్ట్ డేట్ కావడంతో రాహుల్ నామినేషన్ వేశారు. వయోనాడ్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాహుల్ మరోసారి అక్కడి నుంచే పోటీచేశారు. ఏప్రిల్ 26న అక్కడ పోలింగ్ పూర్తయ్యింది. దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల్లో ఈసారి బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ పోటీ హోరాహోరీగా సాగుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ మధ్య మాటల యుద్ధం కూడా అదే స్థాయిలో ఉంటోంది. ఈ క్రమంలో తాజాగా యూపీలోని అమేథీని వదిలి తన తల్లి సోనియాగాంధీ ఈసారి వదిలేసిన రాయ్ బరేలీ స్థానంలో పోటీ చేయాలని రాహుల్ గాంధీ నిర్ణయించారు. ఈ మేరకు ఇవాళ సోనియా, ప్రియాంకతో కలిసి వెళ్లి రాహుల్ నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇప్పటివరకూ కాంగ్రెస్ కంచుకోటలు అమేథీ, రాయ్ బరేలీపై ఆ పార్టీలో నెలకున్న గందరగోళంపై మిగతా 2లో

# తీన్మార్ మల్లన్న సంచలన నిర్ణయం

- తన ఆస్తులు మొత్తం ప్రభుత్వానికి ధారాదత్తం
- రూ. 1.50 కోట్లు ఆస్తులు సర్కారుకు అప్పగింత
- బాండ్ పేపర్ రూపంలో సమర్పణ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పెను సంచలన ఘటన జరిగింది. జర్నలిస్ట్, యువనేత తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను, తన కుటుంబం పేరిట ఉన్న మొత్తం ఆస్తిని రాష్ట్ర ప్రభుత్వానికి బాండ్ రూపంలో రాసిచ్చి సంచలనానికి తెరలేపారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ సందర్భంగా తీన్మార్ మల్లన్న ఈ నిర్ణయం తీసుకున్నారు. తనకున్న రూ.1.50కోట్ల ఆస్తులను ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రకటించారు. గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్న చెప్పిన పని చేసి చూపించారు.

### ఎమ్మెల్సీ అభ్యర్థిగా చింతపండు నవీన్ నామినేషన్

తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్ కుమార్) శుక్రవారం నల్లగొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఖమ్మం, నల్లగొండ, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ మిగతా 2లో



## దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్న మోడీ

వివరాలు 2లో

# రాయ్ బరేలీ నుంచి రాహుల్ నామినేషన్



మొదటిపేజీ తరువాయి

బీజేపీ చేస్తున్న విమర్శలకు చెక్ పడినట్లయింది. అయితే గతంలో మూడుసార్లు గెలిచిన అమేథీ స్థానాన్ని గతంలో ఓడిపోయారన్న కారణంతో ఈసారి వదిలేసుకున్న రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలకు దిగుతోంది. రాహుల్ అమేథీ స్థానంలో పోటీకి భయపడి పారిపోయారని ప్రధాని మోడీ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మొదలైనప్పటి నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, అమేథీ నియోజకవర్గాలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎవరు పోటీ చేస్తారు అనే ఉత్కంఠ నెలకొంది. రాయ్‌బరేలీ నుంచి సిట్టింగ్ ఎంపీగా ఉన్న కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ.. ఈసారి లోక్‌సభ బరిలోకి కాకుండా రాజ్యసభ నుంచి పోటీ చేసి పార్లమెంటులో అడుగుపెట్టారు. దీంతో రాయ్‌బరేలీ స్థానానికి ఎవర్ని బరిలోకి దించుతారు అనే చర్చ జరిగింది. ఇక ఎప్పటినుంచో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న అమేథీలో 2019 ఎన్నికల్లో రాహుల్ గాంధీ పరాజయం కావడంతో ఈసారి పోటీ చేస్తారా లేదా అనే సందిగ్ధం నెలకొంది. అయితే వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ.. ఇక ఆ స్థానానికే పరిమితం అవుతారని అంతా భావించారు. ఇక వయనాడ్‌తోపాటు అమేథీ నుంచి కూడా రాహుల్ గాంధీ పోటీ చేస్తారనే ప్రచారం హస్తం పార్టీ వర్గాల్లో జోరుగా సాగింది. అయితే చివరి వరకు ఉత్కంఠ రేపిన అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాల కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు.. శుక్రవారం ఖరారయ్యాయి. రాహుల్ గాంధీ అమేథీ నుంచి కాకుండా ఎవరూ ఊహించని విధంగా రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తూ షాక్ ఇచ్చారు. ఇక రాయ్‌బరేలీలో సోనియా గాంధీ స్థానంలో ఆమె కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేస్తారనే ప్రచారం జోరుగా సాగింది. ఇక అమేథీలో ప్రియాంక గాంధీ వాద్రా భర్త రాబర్ట్ వాద్రా బరిలోకి దిగనున్నారనే ఊహాగానాలు గుప్పుమన్నాయి. వాటన్నింటికీ తెరదించుతూ రాయ్‌బరేలీ టికెట్ రాహుల్ గాంధీకి.. అమేథీ టికెట్ కిశోరీ లాల్ శర్మకు దక్కింది. అయితే శుక్రవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇది జరిగిన కొన్ని గంటలకే రాహుల్ గాంధీ.. రాయ్‌బరేలీ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ వెంట సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, రాబర్ట్ వాద్రా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఉన్నారు. ఇక అమేథీ నియోజకవర్గంలో కిశోరీ లాల్ శర్మ కూడా నామపత్రాలు సమర్పించారు. మరోవైపు.. వయనాడ్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీ.. తాజా ఎన్నికల్లో మరోసారి అక్కడి నుంచే పోటీ చేశారు. గత నెల 26వ తేదీన వయనాడ్‌లో తొలి విడతలో పోలింగ్ పూర్తయ్యింది. అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలకు లోక్‌సభ ఎన్నికల ఐదో విడతలో భాగంగా మే 20 వ తేదీన పోలింగ్ జరగనుంది. అయితే ఈ స్థానాలకు నామినేషన్లు సమర్పించేందుకు శుక్రవారమే చివరి రోజు కావడంతో చివరి నిమిషంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఇక ఈసారి అమేథీని వదిలి పెట్టి రాహుల్ గాంధీ రాయ్‌బరేలీకి మారడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఆ విమర్శలను తిప్పికొట్టిన కాంగ్రెస్ పార్టీ.. తామేమీ భయపడటం లేదని.. తమ పార్టీ వ్యూహాల్లో భాగంగానే అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ అంటే కరువు, కరప్షన్

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

తెలంగాణలో గాడిద గుడ్డు పాలన కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఐటీ కంపెనీ యజమాని వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు ఇటీ కంపెనీ యజమానులు, ఉద్యోగులు, వరంగల్ జిల్లాకు చెందిన విజేందర్ రావు ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. కాగా వారికి కిషన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా పార్లమెంట్ ఎన్నికలకు కొత్త మేనిఫెస్టో విడుదల చేసిందని విమర్శలు చేశారు. కేంద్ర నిధులు నేరుగా సర్పంచులకు అంటూ పేర్కొందని, అయితే కేంద్రం దీనిని ఇప్పటికే అమలుచేస్తోందన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం హామీపై కూడా చెప్పిందే మళ్లీ చెప్పారని, ఇందులో కూడా గాడిద గుడ్డు తప్ప ఇంకేం లేదన్నారు. రాష్ట్ర పునర్విభజన చేసింది ఎవరు?, ఐదు గ్రామాలను ఏపీలో కలిపిందెవరని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా గ్యారంటీలు అమలు చేసినట్టు బోర్డులు పెట్టారని, వీటిని చూసి ప్రజలు నవ్వుకోవడమే కాక అసహ్యించుకుంటున్నారన్నారు. కేసీఆర్ మసిపూసి మారేడు కాయ చేస్తే.. రేవంత్ ప్రజలకు గాడిద గుడ్డు ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయంలో కొలిక్కివచ్చిన ఉద్యోగాలకు నియామకపత్రాలను ఇచ్చి రేవంత్ తన ఖాతాలో వేసుకున్నారని చురకలంటించారు. కొత్త తెల్ల రేషన్ కార్డులు ఒక్కటైనా ఇచ్చారా? అని ఆయన ప్రశ్నించారు. ఒకటో తేదీన జీతాలు అయినా వస్తున్నాయా? అని కిషన్ రెడ్డి నిలదీశారు. మహిళలకు ఏడాదికి రూ.లక్ష సాయం కావాలంటే ఎన్ని లక్షలు కావాలో తెలుసా? అని ఆయన ప్రశ్నించారు. ప్రగతి భవన్ కంచెలు కూల్చడం తప్పితే అక్కడ వచ్చిన దరఖాస్తులో ఎన్ని పరిష్కరించారో చెప్పాలన్నారు. ఏ ఒక్క రోజు కూడా సీఎం అక్కడ లేరని, అప్లికేషన్ తీసుకోలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయని దద్దమ్మలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని ఫైరయ్యారు. మోడీ సునామీలో రేవంత్ కాళ్ల కింద భూమి కదులుతోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ చేతులెత్తేసిందని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తిరిగే మొహం లేదన్నారు. కాంగ్రెస్ అంటేనే కరువు. కరప్షన్, మోసం, దగా, ఫ్యామిలీ పాలిటిక్స్ అని ఘాటు విమర్శలు చేశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ చెయ్యి గుర్తు మార్చుకొని గాడిద గుడ్డు పెట్టుకున్నట్టు ఉందని కిషన్ రెడ్డి ఎద్దేవాచేశారు. అందుకే రేవంత్ తన నెత్తిపై గాడిద గుడ్డు పెట్టుకొని తిరుగుతున్నారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# సింగరేణిపై పెద్ద కుట్ర





మొదటిపేజీ తరువాయి

కర్ణాటకకు ఇస్తానని ప్రధాని అంటుంటే.. ఈ ముఖ్యమంత్రి సప్పుడు లేదని మండిపడ్డారు. అదే తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రధాని మోదీ ఇదే ప్రతిపాదన తెచ్చిండని తెలిపారు. అయితే.. కేసీఆర్ బతికి ఉండగా గోదావరి నీళ్లు తీసుకెళ్తే ఒప్పుకోనని చెప్పానని పేర్కొన్నారు. కానీ ఇవాళ ఈ ముఖ్యమంత్రి మౌనం వెనుక ఉన్న మతలబు ఏంటనేది ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. గోదావరి నది మన బతుకు.. దాన్నే తీసుకెళ్తా అంటే కాంగ్రెస్ గానీ, ముఖ్యమంత్రి గానీ ఎవరూ కూడా నోరు తెరిచి మాట్లాడే పరిస్థితి లేదని మండిపడ్డారు.

'ఇక్కడ ఉన్న ముఖ్యమంత్రి.. ప్రధానిని బడే భాయ్ అని అంటాడు. గుజరాత్ మోడల్ తెస్తా అంటడు. కానీ ఆ గుజరాత్‌లో పేదల సంక్షేమం చూడరు.. అక్కడ పెట్టుబడిదారుల రాజ్యమే తప్ప కార్మికులు, ప్రజలకు మాట్లాడే హక్కులు కూడా లేవు. ' అని కేసీఆర్ అన్నారు. ఇక మోదీ చోటే భాయ్.. అదే భారత దేశాన్ని మింగుతున్న అదానీ.. మోదీ అండదండలతో 14 లక్షల కోట్లకు పడగలెత్తిన ఆదానీ.. దేశంలోని అన్ని పబ్లిక్ సెక్టార్ రంగాలను కబలిస్తున్నాడు. టీవీ రంగం కావచ్చు.. కేబుల్స్ కావచ్చు.. ప్రతి రంగాన్ని కబలిస్తున్నాడు. దేశంలో ఉన్న ఓడ రేవులన్నీ కూడా ఆదానీకి అన్యక్రాంతమైపోయాయి. ఎయిర్‌పోర్టులను కూడా ఆదానీకే మోదీ అంకితం చేశాడు.' అని కేసీఆర్ తెలిపారు.

నేను సీఎంగా ఉన్న రోజుల్లో కరెంటు ఉత్పత్తి కోసం ఆస్ట్రేలియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవాలని మోదీ చెప్పాడు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు తెచ్చిది ఎవరు ఆదానీ.. నరేంద్ర మోదీ తమ్ముడు. మన దగ్గర 4 వేలకు టన్ను దొరికే బొగ్గును.. అక్కడ 28 వేలకు టన్ను కొనమన్నాడు. కానీ నేను ఒప్పుకోలేదు. నా ప్రాణం పోయినా సరే ఒప్పుకోనని చెప్పా. నాకు సింగరేణి బొగ్గు ఉండగా.. నీ బొగ్గు ఎందుకు అని చెప్పిన. కానీ ఇవాళ ఇదే ముఖ్యమంత్రి పోయి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఆదానీకి గేట్లు తెరిచి వచ్చిండు.. ఆదానీ మీరు తెలంగాణకు రండి.. నాలుగు చేతులతో దోచుకోండి అని సంతకాలు కూడా పెట్టి పిలిచివచ్చిండు. పార్లమెంటు ఎన్నికలు అవ్వడమే ఆలస్యం.. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి సింగరేణిని ఊడగొడతరు. ఇది నిజమా కాదా అని ఇంటికి వెళ్లినంక చర్చ జేయండి. ముఖ్యమంత్రి ఆదానీని ఎందుకు పిలిచిండు.. నేనెందుకు రానివ్వలేదు అనేది ఆలోచన చేయాలని కేసీఆర్ సూచించారు. తెలంగాణకు సింగరేణి కొంగుబంగారం. ఒక ఉద్యోగ వనరు. లక్షలాది మంది కార్మికులు, వారిని అనుసరించుకుని అనేక ప్రజలు బతికే ప్రాంతం సింగరేణి. దీన్ని ఇంకా విస్తరించాలి. బయ్యారం ఉక్కుగనులు గానీ, గోదావరి ఇసుక గనులు గానీ సింగరేణికే ఇవ్వాలని నేను సీఎంగా ఉన్నప్పుడు ఆలోచించినా. సింగరేణి డైరెక్టర్‌ను ఆస్ట్రేలియాకు, ఇండోనేసియాకు పంపించిన. ఆదానీ వెళ్లి కోట్లు గడిస్తుండు.. మనం వెళ్లి అక్కడ ఎందుకు పట్టుకోవద్దు.. సింగరేణి కంపెనీని ఆస్ట్రేలియా, ఇండోనేసియాలో పెట్టమని చెప్పిన. కానీ ఇవాళ ఆదానీ బొగ్గును తీసుకుందామని ఈ ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నాడు. ఇది తేడా. రాబోయే రోజుల్లో ఉన్న సింగరేణిని ఊడగొట్టి ఆదానీకి అప్పగిస్తే మన కార్మికుల నోట్లో మట్టి.. మన ప్రజల నోట్లో మట్టి. మొత్తం సింగరేణి ప్రాంతాల్లోని ప్రజల బతుకులు బొగ్గు అయ్యే పరిస్థితి ఉంటుంది. సింగరేణి కార్మికులు ఈ మాటను చైతన్యంతో ఆలోచించాలి. మీ నిర్ణయం అట్ల తీసుకోవాలి. ఇది చాలా ప్రమాదం. ఇవాళ మీరు పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ను గెలిపిస్తే నేను కూడా ఏం చేయలేను. నావల్ల కూడా ఏం కాదు. కొప్పుల ఈశ్వర్ గెలిస్తే.. మొత్తం బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఎగిరి గంతేసి కొట్లాడి.. పీకపట్టుకుని మా సింగరేణిని ఎట్ల ముంచుతవని కొట్లాడతరు.' అని కేసీఆర్ తెలిపారు. సింగరేణిని కాపాడుకోవాలంటే.. బొగ్గు గని కార్మికుల పక్షాన ఉన్న కొప్పుల ఈశ్వర్ గెలవాలని అన్నారు.

బీజేపీకి 200 సీట్లు రావు అని వార్తలు వస్తున్నాయి. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం రాబోతోంది. 14 నుంచి 15 సీట్లు గెలిస్తే.. సింగరేణిని కాపాడుకుంటాం. నదులును కాపాడుకునే అవకాశం ఉటుంది. బీఆర్ఎస్ ఎంపీ గెలుపులోనే తెలంగాణ గెలుపు ఉన్నది. అరచేతిలో వైకుంఠం చూపించి ఆరు గ్యారెంటీలని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాతపెట్టే సమయం వచ్చింది. బీఆర్ఎస్ బలంగానే ఉంటేనే కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు నెరవేరుస్తది. కాబట్టి విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్‌ను గెలిపించాలి. కొప్పుల ఈశ్వర్ నిస్వార్థపరుడు. కార్మిక లోకంలో బతికిన వ్యక్తి.. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ కోరారు. దళితబంధును బంద్ చేశారు. వారు ఏం పాపం చేశారు. మా ప్రభుత్వంలో లక్షా 30 వేల కుటుంబాలకు మంజూరు చేశాం. వారికి మేం డబ్బులు విడుదల చేస్తే వాటిని వాపస్ తీసుకున్నారు రేవంత్ రెడ్డి. ఈ ఎన్నికల్లో దళితులు ప్రతీకారం తీర్చుకోవాలి. బీఆర్ఎస్‌కు ఓటు వేసి చురుకు అంటించాలి. 2001లో జెండా ఎగురవేసి.. తెలంగాణ రావాలని ప్రాణాలు అడ్డం పెట్టి పోరాటం చేశాను. చావు నోట్లో తలకాయపెట్టి తెలంగాణ సాధించుకున్నాం. సాధించుకున్న తెలంగాణలో ప్రాజెక్టులు కట్టుకున్నాం. సింగరేణిని కాపాడుకున్నాం. పేదలను ఆదుకున్నాం. కానీ అక్రమాలు చేసిన కాంగ్రెస్ ఎక్కువ కాలం ఉండదు. మళ్లా రాబోయేది బీఆర్ఎస్ గవర్నమెంటే.. ప్రజల అండదండలతో మళ్లీ మనమే వస్తాం. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తేనే తెలంగాణ హక్కులను కాపాడుకోగలుగుతాం. సింగరేణి మనది మనకు ఉంటది అని కేసీఆర్ స్పష్టం చేశారు.

# దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్న మోడీ

- ఐదు గ్యారంటీలను అమలు చేశాం
- ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నాలుగు ముక్కలవుతుంది
- 46 జీవోపై వచ్చే అసెంబ్లీలో కమిటీ వేసి రద్దు చేస్తాం
- తీన్మార్ మల్లన్నను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలి
- రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- ఎమ్మెల్సీగా గెలిపిస్తే రాజకీయాలలో సమూల మార్పులు తీసుకువస్తా
- ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



విశాలభారతి,స్టేట్ బ్యూరో:

మోడీ ప్రభుత్వం దేశ సంపదనంతా ఆదాని, అంబానీలకు దోచిపెడుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండఖమ్మంవరంగల్ పట్టబద్దుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నామినేషన్ సందర్భంగా శుక్రవారం నల్గొండలోని ఏచూరి గార్డెన్స్ లో జరిగిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంక్షేమ ధ్యేయంగా ముందుకు పోతుందని అన్నారు. ఇచ్చిన 5 గ్యారంటీలలో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత కెసిఆర్ ,కేటీఆర్ లు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీ నాలుగు ముక్కలవుతుందని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్ ప్రజల సొమ్మును దోచుకోవడంతో కూతురు కవిత జైలుకెళ్ళిందని, వారు కూడా జైలుకెళ్లక తప్పదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తూ ముందుకు పోతుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బీఆర్ఎస్ లకు ఒక్క సీటు కూడా రాదని తెలిపారు. పట్టబద్దుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తన కున్న ఆస్తిని ప్రభుత్వానికి రాసిచ్చి ఎమ్మెల్సీగా పోటీ చేయడం మామూలు విషయం కాదన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో తీన్మార్ మల్లన్నను లక్ష మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని కోరారు. జీవో 46తో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఈ జీవోపై కమిటీ వేసి రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఒక్క అవకాశం ఇస్తే రాజకీయాలలో సమూల మార్పులు తీసుకువస్తానని స్పష్టం చేశారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డి దొంగ ఓట్లతో, అవినీతి సొమ్ముతో గెలుపొందాడని విమర్శించారు. గెలిచిన తర్వాత చేతకాక నిరుద్యోగులను వంచనకు గురి చేశాడని ధ్వజమెత్తారు. గ్రాడ్యుయేట్లంతా ఈ ఎన్నికలలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న తన కుటుంబానికి ఉన్న ఒక కోటి 50 లక్షల రూపాయలను ప్రభుత్వానికి రాసిస్తున్నట్లు ప్రకటించారు. తనకు మద్దతునిస్తున్న రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు, విద్యార్థి సంఘాలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మిర్యాలగూడ ఎమ్మెల్యే భత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పాల్గొని ప్రసంగించగా, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి, నల్గొండ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, తిప్పర్తి జడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకటరెడ్డి, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ట్రస్మా సంఘం నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న సంచలన నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు తీన్మార్ మల్లన్న. ఈ సందర్భంగా ఆయన గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఏ రాజకీయ నాయకుడు చేయని పని చేసి చూపించారు. తాను రాజకీయాల్లోకి అడుగుపెడితే తన పేరిట, కుటుంబం పేరు మీదున్న ఆస్తులను మొత్తం రాష్ట్ర ప్రభుత్వానికి రాసిచ్చి, పాలిటిక్స్‌లోకి వస్తానని గతంలో తీన్మార్ మల్లన్న ప్రకటించారు. నేడు (మే 3న) ఎమ్మెల్సీగా నామినేషన్ వేసే సమయంలో తమ కుటుంబం మొత్తం ఆస్తులను బాండ్ పేపర్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు.

తనపై గతంలో ఎన్ని విమర్శలు వచ్చినా తగ్గలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఆఫీసుపై దాడులు జరిగినా వెనకడుకు వేయని తత్వం తీన్మార్ మల్లన్నది. తాను మాటల మనిషి కాదని, చేతల మనిషినని నిరూపిస్తూ.. గతంలో ఇచ్చిన మాట మేరకు తన కుటుంబం మొత్తం ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వానికి రాసిచ్చారు. తన ఆస్తి పత్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి అప్పగించాలని భావిస్తున్నట్లు పేర్కొన్న తీన్మార్ మల్లన్న.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి టైమ్ ఇస్తే పత్రాలు సమర్పిస్తానని తెలిపారు. పారదర్శకంగా రాజకీయాలు చేయాలని భావించి తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి

నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గతంలో జరిగిన ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న పోటీ చేశారు. కానీ తీన్మార్ మల్లన్న, మరోవైపు ప్రొఫెసర్ కోదండరామ్ ఓట్లు చీల్చారు. కానీ చివరికి అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,49,005 ఓట్లు రాగా, గెలిచిన అభ్యర్థి పల్లాకు 1,61,811 ఓట్లు పోలయ్యాయి. సొంతంగా బరిలోకి దిగినా తీన్మార్ మల్లన్నకు గ్రాడ్యుయేట్స్ భారీగానే ఓట్లు వేశారు. కానీ ఏ పార్టీ సపోర్ట్ లేకపోవడంతో కేవలం 3 శాతం ఓట్ల తేడాతో చింతపండు నవీన్ ఆ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిచెందారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాలతో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ లో చేరారు. కేసీఆర్ ఓటమి కోసం గతంలో పోరాటం చేసిన ఆయనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఛాన్స్ ఇచ్చింది. ఈసారి రెట్టించిన ఉత్సాహంతో తీన్మార్ మల్లన్న బరిలోకి దిగుతున్నారు.

# రోహిత్ వేముల కేసు క్లోజ్



మొదటిపేజీ తరువాయి

బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు, కేంద్రమంత్రి స్మృతి ఇరానీలను కేసు నుంచి తప్పించారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టులో రోహిత్ వేముల కేసుకు సంబంధించి క్లోజర్ రిపోర్టును సమర్పించారు. రోహిత్ వేముల అసలు ఎస్సీ కాదని తేల్చారు పోలీసులు. రోహిత్ వేముల ఎస్సీ అనడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. తన కులానికి సంబంధించి నిజం బయటపడుతుందన్న భయంతోనే రోహిత్ ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని రిపోర్టులో తెలిపారు. కుల ధృవీకరణకు సంబంధించిన పత్రాలు ఫోర్జరీ చేశారని పోలీసులు ఆరోపించారు. అయితే ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా ఎలాంటి ఆధారాలను పోలీసులు సమర్పించలేదు. మరో 10 రోజుల్లో తెలంగాణలోని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనున్న వేళ ఈ రిపోర్టు సమర్పించడం చర్చనీయాంశంగా మారింది. 2016, జనవరి 17న HCUలోని తన హాస్టల్ గదిలో రోహిత్ వేముల సూసైడ్ చేసుకోవడం దేశ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. రోహిత్ వేముల మరణం దేశవ్యాప్తంగా నిరసనలకు దారి తీసింది. అనేక యూనివర్సిటీల్లో విద్యార్థులు ఆందోళనలు చేశారు. దళిత, బహుజన వర్గాలకు రక్షణ కల్పించాలంటూ డిమాండ్ పుట్టుకొచ్చింది. రోహిత్ వేములది ఇనిస్టిట్యూషనల్ మర్డర్‌గా పేర్కొంటూ.. యూనివర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. రోహిత్ వేముల ఆత్మహత్యకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది.

# బీఆర్ఎస్‌కు మరో షాక్




విశాలభారతి,స్టేట్ బ్యూరో:

భారత రాష్ట్ర సమితికి వరుసగా కష్టాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఎమ్మెల్సీ దండె విఠల్ పై అనర్హతా వేటు పడింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి దండె విఠల్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక చెల్లదని కాంగ్రెస్ నేత పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న హైకోర్టు దండె విఠల్ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. దండె విఠల్‌కు రూ.50,000ల జరిమానా విధించింది. 2021లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరిగింది. అప్పుడు బీఆర్ఎస్ అధికారిక అభ్యర్థిగా కేసీఆర్ దండె విఠల్ ను ఖరారు చేశారు. ఈ పేరుతో విబేధించిన అప్పటి బీఆర్ఎస్ నేత పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఇండిపెండెంట్ గా నామినేషన్ దాఖలు చేశారు. అయితే నామనేషన్ల ఉపసంహరణ సమయంలో ఆయన పేరుతో ఉపసంహరణ దరఖాస్తు వచ్చిందని చెప్పి.. ఆయన నామినేషన్ పత్రాలను ఉపసంహరించేశారు రిటర్నింగ్ అధికారి. కానీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రేడి తాను నామినేషన్ ఉపసంహరించుకోలేదని తన సంతకం ఫోర్జరీ చేసి.. ఉపసంహరించినట్లుగా ప్రకటించారని కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయస్థానం .. నామినేషన్ ఉపసంహరణ పత్రాలపై సంతకం పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డిది కాదని తేల్చి.. ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో దండె విఠల్ ఏకపక్ష విజయం సాధించారు. ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేసి 667 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం ఓట్లలో దండే విఠల్ 742 ఓట్లు తెచ్చుకున్నారు. ఆదిలాబాద్ లో మొత్తం ఓట్లు 860. అందులో చెల్లిన ఓట్లు 810, చెల్లని ఓట్లు 45 ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థి పెందూరి పుష్పరాణి 75 ఓట్లకే పరిమితమయ్యారు. పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి నామినేషన్ ఉపసంహరణతో అసలు వివాదం ప్రారంభమయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీలు రాజీనామాలు చేయడంతో వారి స్థానంలో ఎన్నికలు జరుగుతున్నాయి. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఇప్పటికే పూర్తయింది. కోడ్ కారణంగా కౌంటింగ్ వాయిదా పడింది. వరంగల్, నల్లగొండఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి నోటిఫికేషన్ వచ్చింది. రెండో తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. కాంగ్రెస్ తరపున తీన్మార్ మల్లన్న పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు.

# తెలంగాణకు ఐదు న్యాయాలు

మొదటిపేజీ తరువాయి

చేశామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. దీని తయారీకి ఎంతో కసరత్తు చేశామని చెప్పారు. తమ పార్టీ నాయకులతోనే కాక వివిధ సంఘాలతో మాట్లాడామని అన్నారు. తెలంగాణ సమాజానికి మేలు చేసే ప్రతి ఒక్క అంశాన్నీ ఇందులో ఉంచామని వివరించారు. మేనిఫెస్టోలో కీలకమైన 23 అంశాలను ఉంచినట్లు, విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చేలా దీనిని రూపొందించామని వెల్లడించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.
పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారంటీలో భాగంగా మేనిఫెస్టో తయారుచేశామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిందని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలు గడప గడపకూ మేనిఫెస్టోను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
అన్నివర్గాలతో మాట్లాడి మేనిఫెస్టో తయారు చేశారని రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ అన్నారు. ఈ కమిటీలో ఉన్న అందరికీ అభినందనలు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేరలేదని, ఆ పార్టీ నేతల నినాదాలు చూసి ప్రజలు భయపడుతున్నారని ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఐటీ దాడులతో విపక్ష నేతలు ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. దేశ ప్రజలకు న్యాయం జరగాలనే రాహుల్ గాంధీ జోడో యాత్ర చేపట్టారని అన్నారు. దేశం బాగుండాలంటే రాహుల్ ప్రధాని కావాలని ప్రజలు కోరుతున్నారని దీపాదాస్ మున్షీ వెల్లడించారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం జరిగేలా మేనిఫెస్టో ఉందని కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఇప్పటివరకు ఐదు గ్యారంటీలు అమలు చేశామని ఆయన చెప్పారు. రాష్ట్రానికి అన్నిరకాలుగా మేలు చేసేలా మేనిఫెస్టో ఉందని అజారుద్దీన్ తెలిపారు. అన్నివర్గాల ప్రజలకు లబ్ధి జరిగేలా దీనిని తయారు చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు మరో 8 రోజులపాటు కష్టపడి ప్రచారం చేయాలన్నారు. ఈ మేనిఫెస్టో రాష్ట్రానికి బంగారు భవిష్యత్‌ను ఇస్తుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. దీనిని ప్రతి గడప దగ్గరికీ తీసుకెళ్లాలని నేతలు పిలుపినిచ్చారు.


### కాంగ్రెస్ తెలంగాణ ప్రత్యేక మేనిఫెస్టోలోని కీలక అంశాలు

- కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు
- బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం
- రాష్ట్రంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు
- రామగుండంమణుగూరు కొత్తరైల్వే లైను ఏర్పాటు
- రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు
- యువత కోసం వివిధ రకాల యూనివర్సిటీల ఏర్పాటు
- అంతర్జాతీయ ప్రమాణాలతో సాంస్కృతిక, వినోద కేంద్రం ఏర్పాటు
- మేడారం జాతరకు జాతీయ హోదా
- గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐటీఐఆర్ ప్రాజెక్టును ప్రారంభిస్తాం
- భద్రాచలం వద్ద ఏపీలో విలీనమైన 5 గ్రామాలను మళ్లీ రాష్ట్రంలో కలుపుతాం
- 4 సైనిక పాఠశాలలు ఏర్పాటు
- కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు
- కేంద్ర నిధులు నేరుగా స్థానిక సంస్థలకు అందేలా చర్యలు
- సౌరశక్తి ఉత్పత్తిని ప్రోత్సహిస్తాం
- సుప్రీంకోర్టు ప్రత్యేక బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు
- ఏపీలో కలిపిన 5 గ్రామాలను మళ్లీ రాష్ట్రంలో విలీనం
- పాలమూరురంగారెడ్డికి జాతీయ హోదా
- నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు పెంచుతాం

# కార్డియాక్ సమస్యను ముందస్తుగా గుర్తించే అవకాశం ఉందా?

విశాలభారతి:

గుండె పోటు లక్షణాలు ఏంటి అంటే, ఎవరైనా సులువుగా చెప్పేస్తారు, ఛాతిలో నొప్పి, అది ఎడమ చేతికి లేదా దవడకి పాకడం, చమటలు పట్టడం, ఆయాసం రావడం, అలా అలా అని.. గుండె పోటు అనేది, గుండెకు రక్త ప్రసరణ చేసే రక్త నాళాలలో ఒక దాంట్లో, కొవ్వు పేరుకుపోవడం, ప్లేక్ (కాల్షియం పేరుకు పోవడం వల్ల) తయారు అవ్వడం, రక్తం రావడం వల్ల, ఆ గుండె భాగానికి రక్త ప్రసరణ జరగక, నొప్పి తదితర లక్షణాలు కనిపిస్తాయి. నిజానికి గుండె పోటుని గుర్తించడం ప్రతి సారీ అంత సులువు కాదు. ఈ మధ్య కాలంలో గాంధీ హాస్పిటల్లో ఒక స్పెషలిస్ట్ వైద్యుడు, ఛాతిలో నొప్పిని అసిడిటీ, గాస్ నొప్పి అనుకొని మందులు తీసుకొని, ఇబ్బంది పడుతూ తగ్గకపోవడంతో, ఎమర్జెన్సీ విభాగానికి నడుచుకుంటూ వెళ్తూ, మెట్ల మీద కుప్ప కూలి పడిపోయి, మరణించడం సంచలనం సృష్టించింది. అందుకే, ఛాతిలో నొప్పి అని వందసార్లు అనిపిస్తే, వంద సార్లు ECG తీయించాలి అని వైద్యులము చెబుతుంటాము.
అయితే గుండె కొట్టుకునే వ్యవస్థలో ఇబ్బంది కలిగితే, కార్డియాక్ అరెస్ట్ జరుగుతుంది. దానితో క్షణాల్లో గుండె ఆగిపోయి మరణించే అవకాశం ఉంది. ఈ సందర్భాల్లో మనకు సమయం ఎక్కువగా ఉండదు. పక్కన ఉన్న వారు క్షణాల్లో CPR చేస్తే, ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. కార్డియాక్ అరెస్ట్ కి ముఖ్యమైన కారణం (8085%) గుండె పోటు. అది కాక, కొన్ని ఇతర కారణాలతో గుండె లయ తప్పడం వల్ల, భయం వల్ల, పాము కాటు, నీటిలో పడిపోవడం, వంటి సందర్భాలలో, కరెంట్ షాక్ తగిలిన వారికి, కొన్ని రకాల జన్యు పరమైన గుండె సమస్యల్లో (1%) కార్డియాక్ అరెస్ట్ జరిగే అవకాశం ఉంది.
అయితే, ఈ మధ్య కాలంలో, ఎటువంటి లక్షణాలు లేకుండా, గుండె ఆగిపోయి యుక్త వయసు వారిలో కూడా మరణాలు సంభవించడం అందరినీ కలవర పరుస్తున్న విషయం. ఈ నేపథ్యంలోనే గుండె సంబంధిత పరీక్షలు ఏమైనా చేసుకొని, సమస్య ఏమైనా ఉంటే, ముందస్తుగా గుర్తించే అవకాశం ఉందా అనే ప్రశ్న అందరిలో తలెత్తుతుంది. దాని కోసమే ఈ వ్యాసం.



### ECG:

ఒక సాధారణమైన ECG తీయిస్తే, గుండె కొట్టుకునే వేగం, అది లయ బద్ధంగా ఉందా లేదా అనే విషయం నుండి, గుండెలోని ఏదైనా భాగంలో వాపు ఉన్నా, ముందు గుండె పోటు వల్ల ఏ భాగంలో అయినా నష్టం జరిగిందా, గుండె పైని పొరలో నీరు ఉందా, వంటి అనేక విషయాలు తెలుస్తాయి. అయితే, ఇవన్నీ గుండెలో ఇబ్బంది ఉంటే, లేక నష్టం జరిగిన తరవాత తెలిసేవి. ఇది ఆ వ్యక్తి విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు చేసే పరీక్ష అవ్వడం వల్ల, అతను శ్రమిస్తున్నపుడు గుండె మీద ఉండే ప్రభావం ఇందులో తెలియదు.

### TMT:

ట్రెడ్ మిల్ టెస్ట్ అనేది, ఆ వ్యక్తి, ట్రెడ్ మిల్ మీద నడుస్తుండగా, అంటే, శ్రమిస్తుండగా చేసే పరీక్ష. ఇందులో కూడా చూసేది ECG నే. అయితే, ఇందులో ఏదైనా కష్టమైన పని చేసేప్పుడు గుండె ఎలా స్పందిస్తుంది అనేది తెలుస్తుంది. గుండె వేగం పెరిగినప్పుడు ఏమైనా ఇబ్బంది అవుతుందా, లేక గుండె పోటు వచ్చే అవకాశం ఉంటుందా అనేది ఇందులో తెలిసే అవకాశం ఉంది. నిర్ణీత సమయం వరకు పరీక్ష చేసినా ఎలాంటి ఇబ్బంది లేకపోతే, ఆయాసం, నొప్పి వంటివి ఏమీ లేకపోతే ఆ పరీక్ష నార్మల్ అని అర్థం. అయితే ఇది ఆక్టివ్ జీవన శైలి ఉన్న వారిలో మాత్రమే చేయగలము. ఎందుకంటే, వృద్ధుల్లో, లేక ఇతర ఆరోగ్య సమస్యలతో బాధడుతున్నవారికి ఈ పరీక్ష చేసుకోవడం వల్ల కూడా గుండె పోటు వంటి సమస్యలు కలిగే అవకాశం ఉంది

### ఆంజియోగ్రామ్:

ఇది గుండెకు రక్త ప్రసరణ చేసే రక్త నాళాలను పరీక్ష చేసే పరీక్ష. ఏదైనా ఒక రక్త నాలం నుండి, గుండె వద్దకు వెళ్ళి, కరోనరీ ఆర్టరీ లోకి ఒక డై పంపించడం ద్వారా, గుండె లోకి ప్రతి రక్త నాళంలో రక్త ప్రసరణ ఎలా ఉందో చూడగలము. ఇందులో బ్లాక్లు ఏమైనా ఉంటే తెలుస్తాయి. ఎంత శాతం బ్లాక్ ఉందో, ఎన్ని రక్త నాళాలలో ఉంది తెలిస్తే, దానికి అనుగుణంగా, స్టెంట్/స్టెంట్లు వేయడం, లేక గుండె ఆపరేషన్ (CABG) చేయడం జరుగుతుంది. అయితే, ఇది కొంత రిస్క్ తో కూడుకున్న పరీక్ష. అందుకే ఏవైనా గుండె పోటు లక్షణాలు కనిపించినప్పుడు మాత్రమే చేస్తారు.



Dr Pratibha Lakshmi
Associate professor of General Medicine
Gandhi Medical College

ఇవి కాక, స్ట్రెస్ 2D ఎకో వ్యాయామం చేయలేని వారికి, కృత్రిమంగా మందులతో గుండెని ఒత్తిడిగా గురి చేసి పరీక్ష చేసే విధానం. అలాగే నూకియార్ కార్డియాక్ స్ట్రెస్ టెస్ట్, CCTA, కార్డియాక్ MRI వంటి ఇతర పరీక్షలు గుండెకి సంబంధించిన ఇతర అనారోగ్యాలను తెలుసు కోవడానికి, లేక ఏవైనా ఆరోగ్య సమస్యలతో బాధడుతున్నవారు, పై పరీక్షలు చేసుకోలేని సందర్భాలలో, అవసరాన్ని బట్టి వైద్యులు చేయిస్తుంటారు. ప్రతి పరీక్షకి కొన్ని లాభాలు, కొన్ని నష్టాలు ఉంటాయి. అవన్నీ అవగతం చేసుకోవడం ఎంతో విజ్ఞానం, అనుభవంతో కూడుకున్న పని.

### 2D ఎకో:

తరుచుగా వినిపించే ఈ పరీక్షలో అనేక విషయాలు తెలుస్తాయి. గుండె లోని ప్రతి గది ఎంత పెద్దగా ఉంది, ఎంత బాగా కొట్టుకుంటుంది, ఏ భాగం అయినా, సరిగ్గా స్పందించడం లేదా, గుండెలో ఉండే నాలుగు వాల్వ్‌లు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా, ఒక్కో గదిలో ప్రెషర్ ఎంత ఉంది, గుండె నుండి రక్త ప్రసరణ బాగా జరుగుతుందా లేదా, మొదలగు అనేక విషయాలు ఇందులో తెలుస్తాయి. గుండె పోటు వచ్చి ఉంటే, ఆ భాగం సరిగ్గా పని చేయకపోవడం ఇందులో ఖచ్చితంగా తెలుస్తుంది. ఇది తేలికగా చేయగల, చాలా నిర్ధారణలు చేయగల ఒక సులువైన పరీక్ష. కానీ, ఇందులో నష్టం జరిగినాక మాత్రమే గుర్తించగలం.

### CT కరోనరీ ఆంజియోగ్రామ్:

ఇది సమస్య కలగకముందే గుర్తించగల ఒక పరీక్ష. ఇందులో CT స్కాన్ ద్వారా, గుండె రక్త నాళాలను చూడగలము. వాటిలో రక్త ప్రసరణ ఎలా జరుగుతుంది, బ్లాక్ ఏమైనా ఉన్నాయా, ఉంటే ఎంత ఉన్నాయి, మొదలగు విషయాలు ఇందులో తెలుస్తాయి. కొన్ని సందర్భాలలో అన్ని రక్త నాళాలు సరిగ్గా కనిపించక పోవచ్చును. అయితే, ఇందులో రేడియేషన్ అనేది ఒక ప్రమాదం. అందుకే పదే పదే ఈ పరీక్ష చేసుకోలేము.

ఒక పరీక్ష చేస్తే ఖచ్చితంగా తెలిసే సమస్య కాదు కాబట్టి, రెగ్యులర్ వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో, దురలవాట్లకు దూరంగా ఉంటూ, గుండెని పదిలంగా ఉంచుకునే ప్రయత్నం చేస్తూ, అవసరాన్ని బట్టి, సరయిన వైద్యుల సలహాలు పాటిస్తూ ఉండడం అందరికీ మంచిది.!!

# రేవణ్ణ, ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు

## పలు నేరాలకు సంబంధించిన సెక్షన్లు అప్లై

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

కర్ణాటకలో ప్రకంపనలు సృష్టిస్తున్న లైంగిక వేధింపుల అంశంపై కేసులు నమోదయ్యాయి. జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు రేవణ్ణ, మనవడు ప్రజ్వల్‌పై సిట్ బృందం అపహరణ, అత్యాచారం కేసులు నమోదు చేసింది. పలుమార్లు అత్యాచారానికి పాల్పడటం, బెదిరింపులు, కోరిక తీర్చమని బలవంతం పెట్టడం, మహిళలపై దాడికి పాల్పడటం, అశ్లీల చిత్రాలను అప్‌లోడ్ చేయడం వంటి నేరాలకు సంబంధించిన సెక్షన్లు పెట్టారు.
రేవణ్ణ కుటుంబానికి చెందిన ఇల్లు, ఫామ్‌హౌస్‌లో రాజు అనే వ్యక్తి, అతడి తల్లి ఆరేళ్లు పనిచేశారు. మూడేళ్ల క్రితం పని మానేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రేవణ్ణ అనుచరుడు సతీష్.. రాజు తల్లిని ఏవో కారణాలు చెప్పి తీసుకెళ్లాడు. ఎన్నికల తర్వాత తిరిగి ఆమెను ఇంటికి పంపించాడు. ఒక వేళ పోలీసులు అక్కడికి వస్తే వారిని ఇల్లు వదిలి వెళ్లిపోవాలని సూచించాడు. అవసరమైతే.. వేరే ప్రదేశానికి తీసుకెళతానని పేర్కొన్నాడు. ఏప్రిల్ 29న మళ్లీ సతీష్ ఆ ఇంటికి వెళ్లి రాజు తల్లిని బలవంతంగా తీసుకెళ్లాడు. అంతేకాదు రాజుపైనే కేసు పెడతానని



బెదిరించాడు. ఆ తర్వాత అతడి తల్లి వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ అంశం విషయంలో హెచ్‌డీ రేవణ్ణ, ప్రజ్వల్‌పై తాజాగా కిడ్నాప్, అత్యాచారం కేసులు నమోదయ్యాయి. లైంగిక దౌర్జన్యాలకు పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవణ్ణ, ఎంపీ ప్రజ్వల్‌కు సిట్ ఇప్పటికే నోటీసులు జారీ చేసిందని నిన్న రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ వెల్లడించారు. వారు హాజరు కాకపోతే దర్యాప్తు అధికారులు అరెస్టు చేసి విచారించే అవకాశమూ ఉందన్నారు. విచారణకు గురువారం ఈ తండ్రీ కుమారులు హాజరు కాలేదు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేశ్ రెడ్డి

- ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్
- గత నవంబర్ 4న కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో రాకేశ్ రెడ్డి
- 2013లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి

విశాలభారతి,హైదరాబాద్ :

నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్ రెడ్డి పేరు ఖరారైంది. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ప్రకటించారు. 2023, నవంబర్ 4వ తేదీన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రాకేశ్ రెడ్డి గులాబీ కండువా కప్పుకున్నారు. రాకేశ్ రెడ్డి సొంతూరు..హన్మకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం వంగపహాడ్. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన రాకేశ్ రెడ్డి.. బిట్స్ పిలానీలో మాస్టర్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మాస్టర్స్ ఇన్ ఫైనాన్స్ పూర్తి చేశారు. సిటీ బ్యాంక్ మేనేజర్‌గా, జేపీ మోర్గాన్, ఫేస్‌బుక్ లాంటి పలు అంతర్జాతీయ కార్పోరేట్ కంపెనీల్లో బెంగళూరు, అమెరికాలలో ఏడేళ్ల పాటు ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేసిన ఆయన రాజకీయాలపై ఆసక్తితో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2013లో బీజేపీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అంచెలంచెలుగా ఎదుగుతూ బీజేపీలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, రెండు పర్యాయాలు రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేశారు. బీజేపీలో వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన రాకేష్ రెడ్డి వరంగల్ కేంద్రంగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు చేసి ప్రజల్లోకి చొచ్చుకెళ్ళారు. కానీ బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించకపోవడంతో 2023, నవంబర్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఉన్నత విద్యావంతుడు, మంచి వాగ్ధాటి, క్లీన్ ఇమేజ్‌తో పాటు, క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఫలితాలు రాబట్టగల సమర్ధత, కష్టపడి పనిచేసే సొంత టీమ్ ఉంటడం వారికి కలిసొచ్చే అంశాలు. యువతలో, విద్యావంతులలో మంచి పట్టున్న రాకేష్ రెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు, ఫాలోయింగ్ ఉండటంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారు



# టెట్ షెడ్యూల్ రిలీజ్

## ఈనెల 20 నుంచి షురూ • జూన్ 2 వరకు పరీక్షలు

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) షెడ్యూల్ రిలీజ్ అయింది. ఈనెల 20 నుంచి పరీక్షలు కొనసాగనున్నాయి. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ను శుక్రవారం ప్రకటించింది. 11 జిల్లాల్లో ఆన్ లైన్ విధానంలో ఈ పరీక్ష కొనసాగనుంది. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ప్రతిరోజు రెండు సెషన్లలో ఎగ్జామ్ నిర్వహించనున్నారు. గతంలో మే 20 నుంచి జూన్ 3 వరకు 15 రోజులు పరీక్షలు ఉంటాయని వెల్లడించగా దాన్ని ప్రస్తుతం 10 రోజులకు కుదించారు. ఇదిలా ఉండగా టెట్ హాల్ టికెట్లను మే 15 నుంచి జారీ చేయనున్నారు. కాగా టెట్ కు మొత్తం 2.86 లక్షల దరఖాస్తులు వచ్చాయి. కాగా వరంగల్‌నల్లగొండఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ తేదీల్లో మార్పులు చేర్పులు జరిగాయి. ఈనెల 27న పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు ముందు రోజులు, పోలింగ్ రోజును మినహాయించి పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇదిలా ఉండగా జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఉండగా ఆరోజు ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి జాతీయ జెండా ఎగురవేయాల్సి ఉంటుంది. అదేరోజు పరీక్ష ఉండటంతో పలువురు టీచర్లు పరీక్ష రాసేదెలా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జూన్ 2న పరీక్ష తేదీని మారుస్తారా? లేదా? అనేది చూడాలి.

# బెంగాల్ గవర్నర్‌పై లైంగిక ఆరోపణలు

- రాజ్ భవన్ లో రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు దూరారు
- నిరాధార ఆరోపణలపై పోరాడుతా • గవర్నర్ సీవీ ఆనందబోస్

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

బెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్‌పై లైంగిక ఆరోపణలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన గవర్నర్, తనపై వచ్చిన నిరాధార ఆరోపణలపై పోరాడుతానని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రజలకు తన సందేశాన్ని ఇచ్చి సొంత రాష్ట్రమైన కేరళకు బయలుదేరారు. ఆయన కొన్ని రోజుల పాటు అక్కడే ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాజ్ భవన్ కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు దూరారు. వారు దురుద్దేశంతో ప్రతిష్ఠను భంగం చేయాలనే వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం అందింది. దీనిపై వివిధ సంస్థలు సైతం దర్యాప్తు చేపట్టాయి. ఇవన్నీ కేవలం ఎన్నికల కోసం వేసిన ప్లాన్లు మాత్రమే. అని ఆనంద్ బోస్ చెప్పారు. అయితే, గవర్నర్ పై మహిళ ఫిర్యాదు చేసిన మరుసటి రోజే రాజ్ భవన్ ఇలాంటి అనుమానం వ్యక్తం చేయడం ఆసక్తికరంగా మారింది. అంతకుముందు ఈ వార్తలపై ఎక్స్ వేదికగా స్పందించింది రాజ్‌భవన్ కార్యాలయం. "ఇద్దరు అసంతృప్త ఉద్యోగులు కొన్ని రాజకీయ పార్టీలకు ఏజెంట్లుగా మారి అసత్య కథనాలు ప్రచారం చేశారు. నిజం గెలుస్తుంది. సృష్టించిన కథనాలకు నేను భయపడను. ఎవరైనా నన్ను కించపరిచి ఎన్నికల ప్రయోజనాలు పొందాలనుకుంటే వారిని దేవుడే చూసుకుంటాడు. కానీ బంగాల్‌లో అవినీతి, హింసకు వ్యతిరేకంగా నా పోరాటాన్ని వారు నిలువరించలేరు" అని రాజ్‌భవన్ కార్యాలయం ఎక్స్ పోస్ట్ చేసింది. అంతకు ముందు గురువారం రాజ్‌భవన్‌లో తాత్కాలిక విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా ఉద్యోగిని గవర్నర్ హౌస్ ప్రాంగణంలోని పోలీస్‌పోస్టులో ఈ వేధింపుల గురించి చెప్పినట్లు పోలీసులు తెలిపారు. దాంతో ఆమెను స్థానికంగా ఉన్న హరేస్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా ఆమె అక్కడ ఫిర్యాదు చేశారు. ఉద్యోగం విషయంలో ప్రయోజనాలు చేకూర్చుతానన్న నెపంతో గవర్నర్ తనను పలుమార్లు వేధించారని అందులో ఆరోపించారు. మరోవైపు బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై శుక్రవారం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. తన హృదయం ద్రవించిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. పుర్బ బర్ధమాన్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. "రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న ఒక మహిళ గవర్నర్ వేధింపుల గురించి బయటపెట్టింది. ఆమె కన్నీటికి నా హృదయం ముక్కలైంది. తన బాధను వెల్లడిస్తున్న వీడియోను నేను చూశాను. రాజ్‌భవన్‌లో పని చేయడానికి భయంగా ఉందని ఆ మహిళ ఏడుస్తూ వెళ్లిపోయింది. సందేశ్‌ఖాలీ గురించి మాట్లాడేముందు తనవద్ద పనిచేసే మహిళకు గవర్నర్ ఇలాంటి పరిస్థితి ఎందుకు తీసుకువచ్చారో బీజేపీ సమాధానం చెప్పాలి. మహిళల గౌరవం గురించి మాట్లాడేది ఇలాంటి వ్యక్తులా?" అని ఆమె ప్రశ్నించారు.



# ఇండియా కూటమి అధికారంలోకి వస్తుంది



ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ పార్టీని మట్టికరిపించి విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని, మన హక్కులను కాపాడుకునేందుకు విపక్ష కూటమి సర్వశక్తులూ ఒడ్డుతుందని స్పష్టం చేశారు. యూపీలోని సైఫైలో శుక్రవారం ఓ వార్తాసంస్థతో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు.రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్న బీజేపీని దీటుగా నిలువరిస్తామని చెప్పారు. రాయ్‌బరేలి నుంచి నామినేషన్ దాఖలు చేసిన రాహుల్ గాంధీకి అఖిలేష్ మద్దతు పలికారు. కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలి నుంచి నామినేషన్ వేసిన రాహుల్‌కు ఆయన అభినందనలు తెలిపారు. మరోవైపు రాహుల్ రాయ్‌బరేలి నుంచి పోటీ చేయడంతో కాషాయ పాలకులు భయపడుతున్నారని, అందుకే వారు కుటుంబం, కుటుంబ పార్టీ అంటూ విమర్శలు గుప్పిస్తున్నారని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ భార్య, మొయిన్‌పురి ఎస్పీ అభ్యర్థి డింపుల్ యాదవ్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని మోదీ ప్రభుత్వం కోరుకుంటోందని ఆమె ఆరోపించారు

# అరవింద్ కేజ్రీవాల్‌కి స్వల్ప ఊరట

- లోక్ సభ ఎన్నికల మధ్యంతర బెయిల్ వాదనలు
- వినేందుకు సుప్రీం కోర్టు అంగీకారం

విశాలభారతి,నేషనల్ బ్యూరో:

మద్యం కుంభకోణంలో అరెస్టు అయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కి స్వల్ప ఊరట లభించింది లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ పిటిషన్ పై వాదనలు వినేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. మే 7న ఈడీ తరపున వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉండాలని అడిషినల్ సొలిసిటర్ జనరల్ కి ఆదేశించింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఈమేరకు స్పష్టం చేసింది.ఈడీ అరెస్టుకు వ్యతిరేకంగా అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్ విచారణను పరిశీలిస్తాం' అని సుప్రీం ధర్మాసనం తెలిపింది. దీనిపై స్పందించిన ఈడీ తరపు న్యాయవాది అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు, మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తాము వ్యతిరేకిస్తామని కోర్టుకు చెప్పారు. దాంతో మరింత స్పష్టతనిచ్చిన ధర్మాసనం 'కేవలం పిటిషన్‌ను మాత్రమే విచారిస్తాం, బెయిల్ ఇస్తామని చెప్పడం లేదు. చివరకు బెయిల్ ఇవ్వొచ్చు, ఇవ్వకపోవచ్చు' అని చెప్పింది. ఇందుకు సంబంధించి వాదనల కోసం సిద్ధమై మే 7న రావాలని ఈడీకి సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మార్చి 21న అరెస్టు అయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందన తెలియజేయాలని ఏప్రిల్ 15న ఈడీకి నోటీసులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల ముందు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడంపై ఈడీని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అంతకుముందు తనను ఈడీ అరెస్ట్ చేయడంపై ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం ఆయన్ను ఈడీ అరెస్టు చేయడాన్ని సమర్థించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు





## పదోతరగతి ఫలితాల్లో సత్తా చాటిన త్రివేణి స్కూల్ విద్యార్థులు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**పదోతరగతి పరీక్షా ఫలితాల్లో త్రివేణి స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు.10/10 సాధించిన త్రివేణి స్కూల్ విద్యార్థులను శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి వి.జగదీశ్వర్ గౌడ్, హఫీజ్పేట్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్ లు శుక్రవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత శ్రేణి విద్యా ప్రమాణాలతో, క్రమశిక్షణ కలిగిన విద్యాభోదనతో త్రివేణి ట్యాలెంట్ స్కూల్ యాజమాన్యం,విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. మియాపూర్ మైత్రినగర్ లో గల త్రివేణి స్కూల్ బ్రాంచ్ లో ఈ సంవత్సరం జరిగిన పదో తరగతి పరీక్షలో 11 మంది విద్యార్థులు కే. లీలా సాయి చరణ్, కే. ప్రణవి, గల్ల పూజ్య, బసవరాజు శ్రీహిత, కదలి అర్జున దేవి, రూపాని దీక్షిత, కృతిక శ్రీ మహా, కే. హిమేంద్ర సాయి, కే. శ్రీ హర్షిత, ఎస్. వెంకట సాయి తన్మయి, కౌండిన్య, టి.కీర్తి సాయి తేజస్వి లు 10/10 జిపిఏ ర్యాంకు సాధించి సత్తా చాటారని పేర్కొన్నారు. వందశాతం 10/10 ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సెంటర్ హెడ్ సాయి నర్సింహా రావు, ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న, హాస్టల్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్ రావు, లింగంపల్లి బ్రాంచ్ ప్రిన్సిపల్ అనితారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు





# కాంగ్రెస్ కు ఎజెండా లేదు

- **శ్రీధర్ రెడ్డి**
- **దళిత ఆడబిడ్డపై కాంగ్రెస్ కక్ష గట్టింది,ఓటమి భయంతోనే డ్రామాలు**
- **బీఆర్ఎస్ నేతలను బలవంతంగా చేర్చుకుంటున్నారు**

**విశాలభారతి,కంటోన్మెంట్ :**కంటోన్మెంట్ అభివృద్ధే బీఆర్ఎస్ ఎజెండా అని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇంఛార్జ్ రావుల శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ఎన్నికల ప్రచార సరళిపై బీఆర్ఎస్ నేతలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ కు ఎజెండా లేదని, కండువాలు మార్చడమే ఆ పార్టీ ఎజెండా అని రావుల శ్రీధర్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ కు లీడర్లు, క్యాడర్ లేదని.. అందుకే బీఆర్ఎస్ నేతల ఇళ్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారని ధ్వజమెత్తారు. చివరకు కాంగ్రెస్ అభ్యర్థి కూడా ఇతర పార్టీల నుంచి దిగుమతి అయ్యారని చురకలంటించారు. బీఆర్ఎస్ నేతలను ప్రలోభాలకు గురిచేస్తూ, వినకుంటే బెదిరిస్తూ బలవంతంగా కాంగ్రెస్ లో చేర్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే హస్తం నేతలు ఇలాంటి డ్రామాలాడుతున్నారని తేల్చిచెప్పారు. దమ్ముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా కంటోన్మెంట్ ప్రజలు అంతా గమనిస్తున్నారని.. కాంగ్రెస్ కు తగిన శాస్తి తప్పదని తేల్చిచెప్పారు. ఆడబిడ్డను గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపు ఖాయమని, తేలాల్సింది మెజార్టీయేనని రావుల శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏడాదికాలంలో తండ్రిని,చెల్లిని కోల్పోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. నివేదితను ఏకగ్రీవంగా గెలిపించుకోవాల్సింది పోయి...బలవంతంగా బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ చేర్చుకుంటోందని ధ్వజమెత్తారు. సొంత ఇల్లు కూడా లేని సాయన్న కుటుంబానికే ప్రజలంతా సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని గుర్తుచేశారు. నివేదిత గెలుపు.. కంటోన్మెంట్ అభివృద్ధికి మలుపు అని రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు.
రేవంత్ రెడ్డి, మైనంపల్లి లాంటి నేతలు వ్యక్తిగతంగా కక్షగట్టి తనను ఓడించేందుకు కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రచారంలో తనకు లభిస్తున్న అపూర్వ స్పందనను కాంగ్రెస్ నేతలు ఓర్వలేక పోతున్నారని ఆరోపించారు. దళిత ఆడబిడ్డనైన తనపై హస్తం నేతలు ఇంత కక్ష కట్టడం ఎందుకు అని ప్రశ్నించారు. 30 ఏళ్లు ప్రజలకు సేవ చేసిన సాయన్న బిడ్డను ఎందుకు వేధిస్తున్నారని నిలదీశారు. కష్టకాలంలో అండగా నిలవాల్సిన నేతలు.. ఇలా వ్యవహరించడమేంటని నివేదిత వాపోయారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని... తనను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోక్ నాథ్, సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, ఆకుల హరి, నర్సింహ ముదిరాజ్ తో పాటు పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, మహిళా నేతలు, సాయన్న అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## మేనిఫెస్టో గడప గడపకు బూత్ కమిటీ తీసుకువెళ్ళాలి

- **బండి రమేష్**

**విశాలభారతి,కూకట్ పల్లి:** బూత్ కమిటీ ఏజెంట్ గా నియమితులైన ప్రతి ఒక్కరు తమ డివిజన్ పరిధిలోని ప్రతి గడప వెళ్లాలని పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు అందజేసి,కాంగ్రెస్ కే ఓటు వేసేలా చూడాలని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సూచించారు. పూర్తిస్థాయిలో బూత్ కమిటీల నియామకం అనంతరం ఏజెంట్స్ ఆయా డివిజన్లలో డివిజన్ అధ్యక్షులు స్థానిక నాయకులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేశారు. బాలానగర్ పార్టీ కార్యాలయంలో బాలనగర్ డివిజన్ సమావేశం నిర్వహించారు. బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై బూత్ ఏజెంట్స్ నిర్వహించాల్సిన పాత్ర పై మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాన్ని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పై ముద్రించిన కరపత్రాలని తీసుకు వెళ్లి ప్రజలకు వివరించి వారి మనసులను చూరగొనాలన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ వినయ్ రెడ్డి,టిపిసిసి ప్రతినిధులు సత్యం శ్రీరంగం,నాగిరెడ్డి,పుష్పరెడ్డి,సంజీ గౌడ్,పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,లక్ష్మయ్య,మధు గౌడ్, టైగర్ యాదగిరి,నరేందర్ తదితరులు పాల్గొన్నారు





## చేవెళ్ల పార్లమెంట్ గడ్డపై బిఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

- **హైదర్ నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస రావు**
- **హెచ్ఎంటీ శాతవాహన నగర్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే బీఆర్ఎస్ పార్టీ కి భారీ విజయాన్ని అందిస్తాయని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహనగర్ కాలనీలో స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,సాద. మాధవి, మల్లంపల్లి ఉమాదేవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



## చేవెళ్లలో భారీ మెజారిటీతో గెలిచి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- **హస్తం గుర్తుకు ఓటు వేయండి,చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించండి.**
- **హాఫీజ్ పెట్ కార్పొరేటర్ పూజిత గౌడ్.**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని హఫీజ్ పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం హాఫీజ్ పెట్ డివిజన్ హుడా కాలనీలో కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్.జి.రంజిత్ రెడ్డి కి సంపూర్ణ మద్దతుగా నిలవాలని,శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కంటోన్మెంట్ అభివృద్ధి కాంగ్రెస్ తోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**విశాలాభారతి,కంటోన్మెంట్ :**కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక నియోజకవర్గం వార్డ్ 08 లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో కంటోన్మెంట్ నియోజవర్గం అభివృద్ధికి నోచుకోలేదు, కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీగణేష్ గెలిచిన వెనివెంటనే కంటోన్మెంట్ కు ప్రత్యేక నిధులు కేటాయించి కంటోన్మెంట్ అభివృద్ధి చేయడంతో పాటు అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ లో నివసించే పేదలకు 6000 డబుల్ బెడ్రూంలు కేటాయిస్తామని తెలిపారు. మల్కాజిగిరి ఎంపీ గా సునీత మహేందర్ రెడ్డి గెలుపు ఖాయమని ఆశభావం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి మహేందర్ రెడ్డి ప్రజలకు సేవా చేశారని ఆయన సతిమని సునీత గెలుపు అందరు కలిసి కృషి చేయాలనీ సూచించారు.మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ మైనంపల్లి హనుమంతరావు, అందరిని కలుపుకొని ముందుకు వెళ్లడం కాంగ్రెస్ తోనే సాధ్యం అన్నారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ స్వచ్ఛందంగా సేవా చేయడం కలిసి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వెన్నెల గద్దర్, ఉప ఎన్నికల ఇన్చార్జ్ రఘునాథ్ యాదవ్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి ,కదిరి వన్, నరసింహన్, బాలరాజు యాదవ్, అరవింద్,మహిళా నాయకులు,కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం

**కాప్రా,విశాలభారతి:**లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మీర్పేట్ హెచ్ బీ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్ కాలనీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి మరియు పార్టీ శ్రేణులతో కలిసి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కలుస్తూ ప్రచారం నిర్వహించారు. మన అభ్యర్థిని గెలిపించుకుంటే రానున్న రోజుల్లో మన ప్రాంతంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, ఉల్లెం బాలరాజు, భూపతి అశోక్, సాయి కుమార్, వసంతరావు, బోదాసు రవి, శివాజీ, నవీన్ గౌడ్, పూస రమేష్, కత్తుల రాజ్ కుమార్, మోహన్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, కొయ్యడ జయపాల్, నరహరి, మౌల, అజయ్, కుమార్, చక్రవర్తి, నిసార్ అహ్మద్ గోరి, శేఖర్ గౌడ్, దండెం నరేందర్, మహిళా నాయకులు భూలక్ష్మి, అలివేలు, భారతి, రత్నమాల, లక్ష్మి, లావణ్య, శారద, శ్రీవాణి కొమురమ్మ, మరియు వివిధ పార్టీల నాయకులు, కార్మిక నాయకులు, పారిశుధ్య మరియు ఇతర సంఘాల కార్మికులు పాల్గొన్నారు.



## మైనర్లకు మద్యం అమ్మకాలు

- **అడ్డగోలుగా మైనర్లకు మద్యం అమ్ముతున్న వైనం**
- **విషయం బయటికి రాకుండా భేరసారాలు**
- **అధికారులకు తెలిసిన చర్యలు శూన్యం.?**

**చిట్యాల,విశాలభారతి:**చిట్యాల పట్టణంలోని పలు మద్యం షాపుల్లో మైనర్లకు మద్యాన్ని ఎదేచ్ఛగా అమ్ముతున్నారు. 21సం.ల లోపు వారికి మద్యం అమ్మ పడదు అనే నిబంధనలను తుంగలోతొక్కి ఇష్టా రాజ్యాంగ మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. కావలసింది డబ్బులు వయసుతో మాకు పనేంటి ఎవరికైనా అమ్ముకుంటాం అనే ధోరణిలో సంబంధిత వైన్స్ యాజమాన్యం వివరిస్తుంది. ఇదే విషయాన్ని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారికి, చండూరు ఎక్సైజ్ సీఐ కి తెలియజేసినా చర్యలు శూన్యం.? కానీ వైన్స్ యాజమాన్యం 21 సంవత్సరాల లోపు వయసు వారికి మద్యం అమ్మబడదు అని తూతూ మంత్రంగా ఆదరాబాదర ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. విషయం తెలిసిన సదరు వైన్స్ యాజమాన్యం రాజకీయ నాయకులతో విషయం బయటకు పోకుండా జాగ్రత్తలు పడుతుంది. ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా.? చర్యలు తీసుకుంటే జరిమానా ఎంత పడుతుంది.? పూర్తి వివరాలతో ప్రత్యేక కథనం త్వరలో.



## కన్నుల పండుగగా శ్రీ చీర్యాల లక్ష్మి నృసింహ స్వామి వారి ఊరేగింపు

**విశాలభారతి,కీసర** : శ్రీ శ్రీ శ్రీ చీర్యాల లక్ష్మి నృసింహ స్వామి 16 వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం చీర్యాల గ్రామం నుండి ఆలయం వరకు స్వామి వారిని ఊరేగింపుగా తీసుకొని వస్తారు. ప్రతి ఏటా వార్షికోత్సవంలో రోజున స్వామి వారి ఉత్సవ విగ్రహం ఆలయ చైర్మన్ & ఫౌండర్ మల్లారాపు లక్ష్మి నారాయణ ఇంటి నుండి ఆలయ వరకు ఉరేగింపుగా తీసుకెళ్లడం ఆనవాయితీ..ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ఫౌండర్ & చైర్మన్ మల్లరపు లక్ష్మీ నారాయణ దంపతులు.స్వామి వారు వారి ఇంటి దగ్గర నుండి చీర్యాల గ్రామంలో తిరిగి స్వామి దేవాలయానికి చేరుకుంటారు.చీర్యాల గ్రామం లో మహిళలు కోలాటం సాంస్కృతిక కార్యక్రామాలతో భక్తులు హరి నామస్మరణతో ఊరేగింపు మహోత్సవంలో వైభవంగా గ్రామ ప్రజలు పాల్గొంటారు.



## ప్రజలు కేంద్రంలో మోడీ సర్కార్ను దించాలి

- టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్
- **హయత్ నగర్, మనసురాబాద్ డివిజన్లలో సునీత మహేందర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం**

**ఎల్బీనగర్, విశాలభారతి:**పదేళ్ల బిఆర్ఎస్ దుర్మార్గ పాలన ను అంతమందించిన ప్రజలు.. దేశంలో అన్ని వ్యవస్థలను నాశనం చేస్తూ పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరం ఏర్పడిందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎల్బీనగర్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేష్ నాయక్ ఆధ్వర్యంలో హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చెనగోని రవి కుమార్ జరిగిన పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డితో కలిసి శుక్రవారం మనసురాబాద్ డివిజన్ హయత్ నగర్ డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో వందలాదిగా జనం తరలి రాగా.. వీరన్న గుట్ట నుంచి హయత్ నగర్ ఓల్డ్ విలేజ్ మీదుగా బంజారా కాలనీ వరకు ప్రచారం నిర్వహించారు. హయత్ నగర్ స్వామి శంకర్ ఫంక్షన్ హాల్ లో లంబాడీల ఆత్మీయ సమ్మేళనం లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా మహిళల వేషధారణలో సునీత మహేందర్ రెడ్డి నృత్యం చేశారు. హస్తినాపురం డివిజన్ చెందిన పలువురు,నాయకులు మధుయాష్కి గౌడ్,సునీత మహేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రామ్ రెడ్డి , ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ సుజాత నాయక్, టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ వజీర్ ప్రకాష్ గౌడ్ , బుడ్డ సత్యనారాయణ, గజ్జి శ్రీనివాస్ యాదవ్, కళ్లెం సుజాత రెడ్డి, దేరంగుల కృష్ణ, నల్ల రఘుమారెడ్డి, కాంగ్రెస్ చెందిన వివిధ విభాగాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు

**నగరంలో రోడ్ షోలో రెవెన్యూ మంత్రి పొంగులేటి, మంత్రి తుమ్మల**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

యావత్ దేశాన్ని చల్లగా చూసుకోవాల్సిన ప్రధాని మత విద్వేషాలను రెచ్చగొడుతూ.. పదవి కోసం వెంపర్లాడుతూ దుర్మార్గ పాలన సాగిస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని వన్ టౌన్, త్రీ టౌన్ ప్రాంతాల్లో మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి తో కలిసి రోడ్ షో నిర్వహించారు. జిల్లా పరిషత్ నుంచి మొదలై ముస్తఫా నగర్, చర్చి కాంపౌండ్, గాంధీ చౌక్ ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా రెండు కార్నర్ మీటింగుల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. హిందువుల తాళిబొట్లు తీసేసి ముస్లింలకు ఇస్తారని.. బీజేపీ నీచపు వ్యాఖ్యలు చేస్తోందని అన్నారు. మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ.. కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలన నచ్చకనే మొన్నటి ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టారని తెలిపారు. మళ్ళీ ఇప్పుడు నక్క వినయాలతో కర్ర పట్టుకుని యాత్రకు వస్తుండు అని, ప్రజలు ఇప్పుడు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు కోతలు ఉంటాయనీ బీఆర్ఎస్ నాయకులువిమర్శిస్తున్నారని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. బీజేపీపై బహిరంగంగా విమర్శలు చేస్తూ, రాత్రుల్లేమో రహస్యంగా కలిసి మంతనాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల అనంతరం సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి పక్కా ఇంటి సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఉందని, మీ అందరి దీవెనలతో కేంద్రం లో కూడా రానుందని తెలిపారు. రఘురాం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



# ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

■ జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే



**సూర్యాపేట, విశాలభారతి:** ఎన్నికల నిర్వహణకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ తెలిపారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలీసు బందోబస్తు, యాక్షన్ ప్లాన్ పై శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు నల్గొండ పార్లమెంట్ జనరల్ అబ్జర్వర్, సూర్యాపేట జిల్లా పోలీస్ పరిశీలకులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ .వెంకట్రావు ఐఏఎస్, జిల్లా ఎస్పి బి.కె రాహుల్ హెగ్డే సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పటిష్ఠమైన పోలీసు భద్రత ఏర్పాటు చేసినామని , ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ ల వద్ద, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నిక నియమ నిభందనల ప్రకారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని , అన్ని రాజకీయ పార్టీల అధ్వర్యంలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ ల భద్రత ను పరిశీలించామని అన్నారు. సిబ్బందిని కేటాయింపు యాక్షన్ ప్లాన్ ను అబ్జర్వర్స్ కు ఎస్పీ వివరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా ఉంచామని , పోలీసు సిబ్బంది అప్రమత్తంగా పని చేస్తున్నారని తెలిపినారు. అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు లలో ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ల ఏర్పాటు, ఎన్నికల సమయంలో అక్రమ రవాణా, ప్రలోబాలు అడ్డుకోవడం, నగదు, మద్యం, విలువైన ఆభరణాలు సీజ్ చేయడం లాంటివి కట్టుదిట్టంగా చేస్తున్నాము అని తెలిపినారు. ఎన్నికల విదుల నిర్వహణ పై పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. సమన్వయ లోపం రాకుండా పోలింగ్ రోజు విధుల్లో ఉండే సిబ్బందికి సంభందించి మార్గాల వారీగా సిబ్బంది అందరినీ సమన్వయ చేశామని,ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల విధులు నిర్వహిస్తామని,ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఆర్మ్డ్ సిబ్బంది విధుల్లో ఉంటారని ఎస్పీ వివరించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎస్ .వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల సామగ్రికి, ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి రక్షణ కల్పించడం జరిగినదని, స్ట్రాంగ్ రూమ్ ల భద్రత, కౌంటింగ్ కేంద్రాల భద్రత పక్కాగా ఉండాలని నిబంధనల ప్రకారం ఆర్మ్డ్ సిబ్బందిని కేటాయించాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గల ప్రాంతాల్లో భద్రత సిబ్బంది కేటాయింపు, విధుల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది మధ్య సమన్వయం చాలా ముఖ్యం అని ఎన్నికల పరశీలకులు సలహాలు సూచనలు అందించారు. ప్రజల నుండి వచ్చే పిర్యాదులపై, స్థానికంగా ఏవైనా సంఘటనలు జరుగుతే త్వరగా స్పందించేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అబ్జర్వర్స్ కోరినారు.
ఈ కార్యక్రమం నందు పోలీసు పరిశీలకులు అమోగ్ జీవన్ గోవాకర్ , జనరల్ పరిశీలకులు మనోజ్ కుమార్ మానిక్ రావు ఐఏఎస్,ట్రైనీ ఐపిఎస్ అధికారి రాజేష్ మీనా, సెప్షల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు ఉన్నారు.



## మానుకోట గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తాం

■ బలరాం నాయక్ ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
■ కొత్తూరు (జి) కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు బట్టు ఉప్పలయ్య

**కురవి, విశాలభారతి:** మండలం కొత్తూరు (జి) గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు బలరాం నాయక్ గెలుపుకై ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు బట్టు ఉప్పలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల పనిచేసే బలరాం నాయక్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డోర్నకల్ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కొరకు ప్రతి గ్రామంలో పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు డోర్ టు డోర్ తిరుగుతూ స్టిక్కర్లు అంటిస్తూ 5 న్యాయాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు కట్ల నవీన్, ఉపాధ్యక్షులు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి శ్రీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటనారాయణ, నాయకులు వెంకన్న, యాకయ్య, బట్టు నరసయ్య, భాస్కర్, మల్లేష్, నాగేశ్వరరావు, శివ, శ్యాం ప్రసాద్, ఈశ్వర్, వెంకన్న, బాలాజీ, మదర్, వేణుగోపాల్, నగచారి, సత్యం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బంచరాయితండ గ్రామంలో పేరుకే చలివేంద్రం

■ గాలి వదిలేసిన చలివేంద్రం
■ చలివేంద్ర ప్రదేశానికి శుభ్రం చేయని వైనం
■ ప్రతిరోజు మంచినీటి మార్చని వైనం
■ కుండ గ్లాసులను పరిశుభ్రం చేయడం లేదు.
■ కుండ గ్లాస్ పై పేర్కొని ఉన్న మట్టి



**కురవి, విశాలభారతి:** మండలం బంచరాయితండ గ్రామ పంచాయతీ లో చలివేంద్రం పేరుకే ఉన్నది. కానీ ఆ యొక్క చలివేంద్రాన్ని పరిశుభ్రం చేయని వైనం. చలివేంద్రంలో ప్రతిరోజు మంచినీటిని మార్చి గ్రామ ప్రజలను అందించాలి. కానీ కుండలో ప్రతిరోజు నీరు పోయేక గాఢ నిద్రలో పంచాయతీ. చలివేంద్రం ప్రదేశాన్ని ప్రతిరోజు పరిశుభ్రం చేయాలి కానీ బంచరాయితండ చలివేంద్రాన్ని శుభ్రం చేయకుండా ఉన్నారు. అదేవిధంగా ఉండను గ్లాస్ ను పరిశుభ్రం చేయకుండా కుండలో మంచినీరు పోయకుండా గాలికి వదిలేశారు. ప్రజలు గ్రామాల నుండి పట్టణ కేంద్రానికి వెళ్లి తిరిగి వచ్చినప్పుడు చలివేంద్రం కెళ్ళి చూస్తే చలివేంద్రంలో నీరు కరువు. రోజురోజుకు ఎండల తీవ్రత ఎక్కువ పెరిగిపోతుంది. దాంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ గ్రామాల నుండి పట్టణ ప్రాంతాలకు వచ్చే ప్రజలు బాటసారిలకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతయని ఏర్పాటు చేస్తే మూడు నాలుగు ముచ్చట చేసి చలివేంద్రం కుండలో నీరు పోయాక గాలికి వదిలేశారు. వేసవికాలం మోగిసే వరకు చలివేంద్రాన్ని కొనసాగించాలి కానీ మూడు రోజులకే మూలన వదిలేశారు. తక్షణమే బంచరాయితండ చలివేంద్రం ప్రదేశాన్ని పరిశుభ్రం చేసి ప్రతిరోజు మంచినీటి మార్చి, కుండను గ్లాసును పరిశుభ్రం చేసి కుండపై గ్లాసులపై పేర్కొని పోయిన మట్టి శుభ్రం చేయాలని అన్నారు. చలివేంద్రం అనేది ప్రజల దాహార్తిని తీరుస్తుంది పనుల నిమిత్తం వచ్చే గ్రామస్తులు ముఖ్యంగా పేదవారికి ఈ చలివేంద్రం ఎంతో ఉపకరిస్తాయి.



## కడియం కావ్యను భారీ మెజారిటితో గెలిపించాలి

■ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని

**దేవరుప్పుల, విశాలభారతి:** సింగరాజు పల్లి గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పాలకుర్తి నియోజక వర్గం నుండి కడియం కావ్యకి అఖండ మెజారిటీ అందించాలని ఎమ్మెల్యే యశస్విని కోరారు. అనంతరం ఆయా పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే యశస్విని.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, పార్టీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు,యూత్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినెటర్లు తదితరులు పాల్గొన్నారు.



## కవితమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలి

■ బిఆర్ఎస్ తోనే మానుకోట అభివృద్ధి సాధ్యం
■ మాజీ మంత్రి రెడ్యానాయక్ ఊరూరా ప్రచారం

**కురవి, విశాలభారతి:** పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితమ్మ ను గెలిపించాలని కోరుతూ కురవి మండలం బంచరాయితండా గ్రామ పంచాయతీకి పర్యటించి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా. మాజీ మంత్రి రెడ్యా నాయక్ మాట్లాడుతూ.. మానుకోట బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ కార్యకర్తలకు నాయకులకు గ్రామస్తులకు తెలిపారు. కవితమ్మ గెలుపుకై ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసే గెలిపించుకోవాల్సిన అవసరం కార్యకర్తలపై ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్, యూత్ మండల అధ్యక్షుడు బాణోత్ రమేష్ బంచరాయి తండ మాజీ సర్పంచ్ శరత్, నాయకులు మోతిలాల్, సుందర్, సూర్య, వీరు, తదితరులు పాల్గొన్నారు.



## హస్తంతోనే దేశంలో మార్పు సాధ్యం

■ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్ లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మానుకోట పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి శ్రీ పోరిక బలరాం నాయక్ గెలుపుకై పార్లమెంటరీ నియోజకవర్గ సీపీఐ ప్రజా పిలుపు సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మానుకోట కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే సీపీఐ జాతీయ నాయకులు కూనంనేని సాంబశివరావు, మానుకోట శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెన్నరెడ్డి భరత్ చంద్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ తక్కలపల్లి శ్రీనివాస్ రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ సారథి, మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య, డోర్నకల్ నియోజకవర్గం పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ జూలకంటీ సీతారాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ గూటికి బిఆర్ఎస్ నాయకులు

**దేవరుప్పుల, విశాలభారతి**: సింగరాజు పల్లి గ్రామంలో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించిన ఎమ్ఎల్ఎ మామిడాల యశస్విని రెడ్డి ప్రచారం జరిగిన అనంతరం బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ అంగడి యాదగిరి, సిసిఎస్ మాజీ డైరెక్టర్ మడిపల్లి యాదగిరి, యాకయ్య, దుర్గయ్య, శ్రీను, మేడ పద్మారావు, రాపాక అంజయ్య, మడిపల్లి దుర్గయ్య, చేరారు ఈ కార్యక్రమంలో కోరుట్ల మండల అధ్యక్షులు నల్ల శ్రీరాములు, సింగరాజుపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్ద మల్లారెడ్డి మరియు కాంగ్రెస్ నాయకుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు.ఈ కార్యక్రమంలో నల్ల యాదగిరి, పవన్ కల్యాణ్, చింతల శ్రీనివాస్, గౌరయ్య, రచ్చ సోమయ్య,మడిపెల్లి. సంపత్, కాంగ్రెస్ నాయకులు యువజన నాయకులు తదితరులున్నారు.



## కుందూరు రఘువీర్ రెడ్డిని గెలిపించండి

**పాలకీడు విశాలభారతి:** పాలకవీడు మండలంలోని బొత్తల పాలెం గ్రామంలో సిపిఎం శాఖా సమావేశం జరిగినది. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్యులపై పన్నులు వేసి కార్పోరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నదని కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతూ లౌకిక తత్వానికి తూట్లు పొడుస్తున్నదని మతం పేర కులం పేర ఓట్లు పొందాలని చూస్తున్నదని ఆయన అన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెడుతూ రాముని పేరు జపం చేస్తూ హిందువుల ఓట్లు కొల్లగొట్టాలని బిజెపి ప్రయత్నిస్తున్నదని వారి ప్రయత్నం వారి ఆటలు సాగవని ఆయన అన్నారు. అంతేకాకుండా బిజెపి మూడవసారి అధికారులకు వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందని రాజ్యాంగ స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తుందని, రిజర్వేషన్ రద్దు చేస్తుందని ఎట్టి పరిస్థితుల్లో బిజెపిని మూడవసారి అధికారంలోకి రాకుండా వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులు గట్టి ప్రయత్నం చేస్తున్నాయని ఆయన అన్నారు. అవినీతిక బి ఆర్ ఎస్ గత పది సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని కానీ వారి కెసిఆర్ కుటుంబం ఆస్తులు పెంచుకున్నారని ఆయన అన్నారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి బీఆర్ఎస్ లను ఓడించి సిపిఎం సిపిఐ బలపరిచిన ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు వడ్డే సైదయ్య గ్రామ శాఖ కార్యదర్శి ఆర్లపూడి వీరభద్రం, నాగేశ్వరరావు, లింగయ్య,వీరస్వామి, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగం



**మోతె, విశాలభారతి:** మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగం కోసం కేంద్ర ఎన్నికల సంఘం వయో వృద్దులు వికలాంగులు నడువలేని ప్రతి ఒక్కరికీ తమ ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకునే విధంగా అవకాశం కల్పించడంతో శుక్రవారం ఓటు హక్కు ను మోతె మండల కేంద్రంలో పార్లమెంట్ అభ్యర్థి కి ఓటు వేసి పల్లెల వనిత ద్వియంగురాలు అయిన ఓటు హక్కు ను సద్వినియోగం చేసున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమం లో యస్ ఐ వెంకటరెడ్డి, అర్ ఐ మన్సూర్ అలీ, బి యల్ ఒ డి పద్మ, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.



## పీర్జాదిగూడలో గడప గడపకు బీఆర్ఎస్ కార్యక్రమం

**మేడిపల్లి,విశాలభారతి:**మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా 14వ డివిజన్ అధ్యక్షులు జావీద్ ఖాన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్, వివేకానంద నగర్, వినాయక నగర్లో నిర్వహించిన గడప గడపకు ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాల తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత 420 హామీలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ అక్కల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర ఉద్యమంలో ఏఐవైఎఫ్ ది కీలకపాత్ర

**పాలకీడు, విశాలభారతి:** భారతదేశ స్వతంత్ర సంగ్రామ చరిత్రలో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ది కీలకమైన పాత్ర అని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను అన్నారు. ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేరేడుచర్ల మండల కేంద్రంలో ఆ సంఘం పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ..1947కు పూర్వం ఈ దేశంలో ఉన్న యువతకు ఒక సంఘం కావాలని నాటి మేధావులు ఆలోచించి తీర్చిదిద్దన సంఘమే ఏఐవైఎఫ్ అని నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన ఐదు వేల మందిలో అత్యధిక భాగము యువజనులే ఆత్మ బలిదానం చేశారని, త్యాగాల పునాదుల మీదనే యువజన సమాఖ్య నిర్మించబడిందని, నాటి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుఅని ఏఐవైఎఫ్ చేసిన అసమాన పోరాటం చరిత్రలో లిఖించబడిందని, ఆయన గుర్తు చేశారు. కానీ నేడు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం 30 లక్షల ఉద్యోగాలను కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని నింపకుండా నిరుద్యోగులను మోసం చేసిందని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో 20 కోట్ల ఉద్యోగాలు నింపాల్సి ఉండగా కేవలం 60 లక్షల ఉద్యోగాలను మాత్రమే కల్పించి యువతను మోసం చేశారని కావున రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగ యువతను మోసం చేసిన ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శిలోజు సురేంద్ర చారి, చిలక రాజు జయంత్, మచ్చ వరుణ్ మచ్చ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎలక్షన్లపై అవగాహన సదస్సు

**కురవి ,విశాలభారతి:** జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపిఎస్ ఆదేశాల మేరకు కురవి మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మొగిలిచర్ల, రాజోలు గ్రామాలలో డీఎస్పీ ఎన్ తిరుపతి రావు, సీఐ సర్వయ్య, కురవి ఎస్సై గోపి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే పోలీసుల లక్ష్యమన్నారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఇంటింటి ప్రచార కార్యక్రమం విజయవంతం చేయండి

■ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండాపురం శ్రీశైలం

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**భువనగిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్ యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో నేడు ఉదయం పర్యటించనున్నారని ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండాపురం శ్రీశైలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ నందివనపర్తి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో క్యామ మల్లేష్ పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్యామ మల్లేష్ కుమార్తె క్యామ ఆరోని రానున్నారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమానికి కార్యకర్తలు, పార్టీ సీనియర్ నాయకులు



అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# శివసేనారెడ్డికి ఘన సన్మానం

**వనపర్తి విశాల భారతి:** శివసేనారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఉద్యమాలు చేసి యువతను చైతన్యవంతం చేసి రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి తో విశేషమైన గుర్తింపు పొందారని ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి వనపర్తి జిల్లాకు రావడంతో కాంగ్రెస్ శ్రేణులు, ఐక్యవేదిక నాయకులు కొత్త కాపు శివసేనారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే వనపర్తి జిల్లాలో రాష్ట్రంలోనే కీలక పదవిలో కొనసాగుతున్నారని, వారందరూ కలిసి కట్టుగా ఉండి వనపర్తి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి మాట్లాడుతూ... వనపర్తి జిల్లాతో పాటుగా రాష్ట్రంలో ఉన్న యువతి యువకులు విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో అంచలంచలుగా ఎదిగి జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు తైలం శంకర్ ప్రసాద్, కౌన్సిలర్లు బ్రహ్మం, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి పరీక్షలతో భూమికి బలం

- దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు



**భీమదేవరపల్లి విశాల భారతి**పంటలు సాగుచేసే రైతులు మేలైన దిగుబడి సాధించాలంటే భూమి సారవంతంగా ఉండాలి. అయితే ఏ భూమిలో ఎంత మేరకు పోష కాలున్నాయనే విషయం భూసార పరీక్షలతోనే తెలిపోతుందని దేశ్ పాండే ఫౌండేషన్ నిర్వాహకులు చెప్తున్నారు. శుక్రవారం మండలంలోని రసూల్ పల్లి గ్రామంలో మట్టి పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేలలో అనేక పోషకాలుంటాయి. కానీ పంటల దిగు బడి కోసం వ్యాపారులపైనే ఆధార పడుతున్న పలువురు రైతులు అదనంగా సేంద్రియ, రసాయ నిక ఎరువులను వాడుతున్నారు. తద్వారా సాగు ఖర్చు పెరగడమే కాక నేల తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఇలా జరగొద్దంటే ప్రతి రైతు 23 ఏళ్లకోసారి భూసారాన్ని తెలుసుకోవాలని, తద్వారా అవసరమైన ఎరువులు వాడితే ఫలితం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రైతులు భూమిని కాపాడుకునేందుకు భూసార పరీక్ష తప్పక చేయించుకోవాలని సూచిస్తున్నారు.



# బీజేపీ, బీఆర్ఎస్ కు బుద్ధి చెప్పాలి

**భీమదేవరపల్లి విశాల భారతి**గత పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిస్థాయిలో విఫలం చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శిఖబాబు అన్నారు. శుక్రవారం మండలం లోని కొత్తపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే విధంగా మండలంలోని భీమదేవరపల్లి, కొప్పూరు, గట్ల నర్సింగపూర్, రత్నగిరి, ముల్కనూర్,బోలోనిపల్లి, కొత్తకొండ పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఆగస్టు 15 లోగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెలిచాల రాజేందర్ రావు ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, మాజీ సర్పంచ్ పొన్నాల హేమలత మధుసూదన్ రెడ్డి, మీసా మహేష్, రాజమణి స్వప్న, మహేందర్, గజ్జి వీరయ్య, ఆదిరెడ్డి,నాగిరెడ్డి, రేణికుంట్ల ప్రవీణ్ వేల్పుల రాజేష్, శిఖ క్రాంతి,సురేష్, దివాకరరెడ్డి, చంద్రమోగిలి, తదితరులు పాల్గొన్నారు.



# జంపింగ్ జంపాంగ్

- కార్యకర్తలు పార్టీలు మారడంపై లాభమా? నష్టమా?

**ఆర్మూర్, విశాల భారతి** ఆర్మూర్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ ,బిజెపి లకు చెందిన ముఖ్య నాయకులు పార్టీ మార్పు వలన గ్రామస్థాయిలో సమీకరణాలు మారుతున్నాయి. అధికారం ఎటువైపు ఉంటే ఆ పార్టీలకు వెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. ఇంతకుముందు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో ప్రభుత్వ పథకాలు, లబ్ధి పొందారు. అసెంబ్లీ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వెయ్యండి అని చెప్పిన నాయకులు, బిఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు ఓటర్లను అభ్యర్థించారు. అదే విధంగా నాలుగు నెలలోనే మార్పులు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి వలస వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికలలో కారుకు బదులు చేతి గుర్తుకు ఓటు వెయ్యండి అని చెప్పడంతో గ్రామాలలోని ఓటర్లు కంగు తింటున్నారు. ఇంతకుముందు చేతి గుర్తుకు వెయ్యొద్దు కారు గుర్తుకు వేస్తేనే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని పింఛన్లు వస్తాయని చెప్పిన నాయకులే పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేస్తేనే అభివృద్ధి జరుగుతుంది అని అనడంతో ఓటర్లు అయోమయంలో ఉన్నట్లు తెలుస్తుంది.

**అధికారం ఉంటేనే అండదండ:**

రాజకీయంలో అధికారం ఉంటేనే ఇతర అధికారుల నుండి అండదండలు తమపై ఉంటాయని పార్టీలు మారుతున్నట్లు తెలుస్తుంది. పార్టీ మారిన మరికొందరు తమకున్న వ్యాపారంపై అధికారుల ఒత్తిడి రావద్దని జంపింగ్ జంపాంగ్ అయినట్లు ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రజలు జోరుగా చర్చించుకుంటున్నారు.

**సీనియర్లకు కుంపటి:**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో సీన్ ఒకసారిగా రివర్స్ అయింది. బిఆర్ఎస్ పార్టీలో ఉన్న ముఖ్య నాయకులు హస్తం గూటికి చేరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉనికి లేనప్పుడు పార్టీకి వెన్నంటి ఉండి పార్టీ కోసం నిరంతరం కష్టపడిన నాయకులు బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరడంతో పార్టీలో తమను పట్టించుకోరని కొందరు నాయకులు అంటున్నట్లు తెలుస్తోంది.

# ఓడిపోతమన్న భయంతో చీటింగ్ మొదలెట్టారు

- రుణమాఫీ చేయకపోవడమే గాడిద గుడ్డు
- మీ గ్యారెంటీలు గాడిద గుడ్డు
- కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పెద్ద స్కాం స్టార్ అని, ఇది తాను చెప్పింది కాదని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పిన విషయమేనని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ ముందు మోడీని మంచోడని పొగిడి ఇప్పుడేమో గాడిద గుడ్డు ఇచ్చాడని మాట్లాడుతున్నారని విమర్శలు చేశారు. రేవంత్ విధానాలు మారాయని, ఇది మంచిది కాదని హెచ్చరించారు. బూతులు మాట్లాడితే తెలంగాణ గౌరవం తగ్గుతుందన్నారు. ఇస్తామని హామీలు అమలుచేయలేకపోవడమే గాడిద గుడ్డు అని కొండా పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోవడమే గాడిద గుడ్డు అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలన్నీ గాడిద గుడ్డులా కనబడుతున్నాయని కొండా వివరించారు. వారికి చెప్పడానికి ఏమీ లేకనే పర్సనల్ ఎటాక్ చేస్తున్నారని ఫైరయ్యారు. మక్కాకి వెళ్లేందుకు ముస్లింలకు, జెరుసలాంకు వెళ్లేందుకు క్రిస్టియన్లకు ఆర్థిక సాయం అందిస్తున్నారని, అలా హిందువులకు ఎందుకు ఇవ్వడంలేదని కొండా ప్రశ్నించారు. దీన్ని బట్టి మతతత్వ వాదులు ఎవరనేది తెలుస్తోందన్నారు. రంజిత్ రెడ్డి ఎంపీ అయ్యాక మిడ్డే మీల్స్ గుడ్ల స్కాం చేశారని, హనుమాన్ మందిరాన్ని కూడా కూల్చారని, అక్కడ రియల్ ఎస్టేట్ చేస్తున్నారని కొండా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇది ఆయన అఫిడవిట్ లో కూడా ఉందని కొండా తెలిపారు. రంజిత్ రెడ్డి దీనిపై చర్చకు సిద్ధమా అని కొండా సవాల్ విసిరారు. అదే హనుమాన్ గుడి వద్ద చర్చకు సిద్ధమా? అని డిమాండ్ చేశారు. రంజిత్ రెడ్డి తనకు ఫోన్ చేసి తమ తల్లిని, సతీమణిని కూడా తిట్టారని కొండా తెలిపారు. ఈ భాష మంచిది కాదని ఆయన సూచించారు. ఎన్నికల్లో ఓడిపోతున్నాననే చీటింగ్ మొదలెట్టారని విశ్వేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. అందుకే తన పేరు ఉన్న వ్యక్తితో నామినేషన్ వేయించారన్నారు. రంజిత్ రెడ్డి బీజేపీలో చేరేందుకు మూడు నెలలు ప్రయత్నం చేశారని, ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆయన కాంగ్రెస్ లో చేరారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారాంపూర్‌లో 1100 ఎకరాల ఎండోమెంట్ భూమిని అమ్ముకుందని, ఎకరానికి రూ.3 లేదా 4 కోట్ల విలువైన భూమిని అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకునే అవకాశం ఉన్నా ఏమాత్రం పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తోందని విశ్వేశ్వర్ రెడ్డి విమర్శలు చేశారు. ఇద్దరూ కలిసి పంచుకుంటున్నారని కొండా ఆరోపణలు చేశారు



# హస్తం గూటికి మాజీ సర్పంచ్

**ఆర్మూర్, విశాల భారతి** నందిపేట్ మండలంలోని షాపూర్, జోర్పూర్, బాద్గుణ గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న చోటుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. పార్లమెంట్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు సూచించారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద మహిపాల్ ఆధ్వర్యంలో బాద్గుణ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ , మాజీ లిఫ్ట్ చైర్మన్ గడ్డం గంగారెడ్డి బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కాండం వేసి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, దూడ వెంకటేష్, సిలిండర్ లింగం, నక్క బోజేందర్, అల్లెపు గంగాధర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేను ఓటు వేస్తాను.. మరి మీరు!




**సూర్యాపేట, విశాలభారతి:** కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన సెల్ఫీ కేంద్రంలో "నేను ఓటు వేస్తాను ఎందుకంటే నేను ఇండియాను ప్రేమిస్తాను" అనే నినాదంతో ఏర్పాటుచేసిన సెల్ఫీ కేంద్రంలో శుక్రవారం జనరల్ అబ్జర్వర్ మనోజ్ కుమార్ మాణిక్యరావు సూర్యవంశీ ఐఏఎస్, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు, జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఫోటో దిగారు. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యత అందరూ గుర్తించాలని, అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత, కలెక్టరేట్ ఏవో మధుసూదన్ రెడ్డి, ఎన్నికల సూపర్డేంట్ శ్రీనివాసరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్ లో చేరిన పిఎసిఎస్ మాజీ చైర్మన్

**నడిగూడెం, విశాలభారతి:** నడిగూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ చైర్మన్ బృందావనపురం గ్రామానికి చెందిన పుట్టా రమేష్ కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బృందావనపురం గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డు గోవర్ధన్, పుట్ట చంద్రయ్య కంభంపాటి చైతన్య కంభంపాటి శ్రీనివాస్ మాతంగి మాధవరావు, చంద్రావు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజా సంక్షేమం

- కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి ని గెలిపించండి
- కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**కోదాడ, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ప్రజల సంక్షేమ అభివృద్ధి జరుగుతుందని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుండి కోదాడ పట్టణంలో నల్గొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి తో కలిసి ప్రచారం నిర్వహించారు. పట్టణంలో కటకమ్మ గూడెం రోడ్డులో మార్నింగ్ వాకింగ్ కి వెళ్లే వారిని బాయ్స్ హై స్కూల్ లో క్రీడాకారులను హుజూర్నగర్ రోడ్డులోని జగ్గు భాయ టీ స్టాల్ వద్ద ఓటర్లతో కలిసి టీ తాగుతూ హస్తం గుర్తుకు ఓట్లు వేసి రఘువీర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. టీ స్టాల్ నిర్వాహకులు జగ్గు భాయ్ ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, అభ్యర్థి రఘువీర్ రెడ్డి టీ చాలా బాగుందంటూ అభినందించారు. అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలో ఐదు అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట "సిహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, వంగవీటి రామారావు, సంపేట రవి, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏటుకురి రామారావు, ప్రముఖ వ్యాపారులు ఉప్పలవంచు శ్రీనివాసరావు, సుందరి వెంకటేశ్వర్లు, గంధం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# పోలింగ్ బూత్ కేటాయించాలని గిరిజనులు ఆందోళన

- కుట్ర పూర్వకంగా పోలింగ్ బూత్ ను సర్పంచ్ తరలించారు
- మాజీ సర్పంచ్ జేత్య నాయక్

**మరిపెడ, విశాలభారతి:** జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలం చింతాలగడ్డ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎవరి తండాలో వాళ్లదే రాజ్యమని గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిన తరుణంలో చింతల గడ్డ తండ గ్రామపంచాయతీగా ఏర్పడడం జరిగింది. అప్పటినుండి ఆ తండాలో స్కూల్లో గ్రామపంచాయతీ భవనాన్ని ఏర్పాటు చేసి అక్కడి నుండి చింతల గడ్డ తండా తండా గ్రామపంచాయతీ కింద రూప్సింగ్ తండా , రెక్క తండ ఈ రెండు తండాలో గ్రామపంచాయతీలో ఉన్నాయి. చింతల గడ్డ తండా గ్రామ సర్పంచ్ గా రూప్ ఆసింగ్ తండ నుంచి ఎన్నికవ్వడం జరిగింది. గతంలో చింతల గడ్డ తండా గ్రామపంచాయతీలో నే స్టేషన్ ఉండేది. సర్పంచ్ ఎంపీటీసీ ఎన్నికలను ఇక్కడే నిర్వహించడం జరిగింది. పోలింగ్ బూత్ నెంబర్ (204) ఈ పోలింగ్ బూత్ ను స్థానిక సర్పంచ్ కుట్ర పూర్వకంగా అధికారులతో కుమ్మక్కై ఇక్కడి పోలింగ్ ను రూప్ సింగ్ తండకు తరలించారు. చింతల గడ్డ తండా గ్రామపంచాయతీ నుండి రూప్సింగ్ తండకు వెళ్లాలంటే 5 కిలోమీటర్లు ఉంటుందని కుట్ర పూర్వకంగా కార్యదర్శి ,సర్పంచ్ కలిసి ఇక్కడి పోలింగ్ బూత్ స్టేషన్ ని రూసింగ్ తండకు తరలించడం వల్ల తొండ వాసులందరూ స్థానిక సర్పంచ్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మార్వో తక్షణమే స్పందించి మా పోలింగ్ బూతులు మాకు మరల కేటాయించాలి లేకపోతే వచ్చే ఎంపీ ఎలక్షన్లలో ముక్కుముడిగా తండా వాసుల మందిరం కలిసి బహిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తండ పెద్ద మనుషులు అంగోతు తేజ్య నాయక్,రవీందర్,కిర్యా,బిక్కు,వెంకన్న,సికిందర్,నగేష్,బాలాజీ,శీతల,కమ్లీ,బజ్జు,మంగమ్మ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కదం తొక్కిన సిపిఐ కురవి నేతలు

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి

**కురవి, విశాలభారతి:** మండలం నుంచి మానుకోట పార్లమెంటరీ స్థాయి సభకు కదం తొక్కిన సిపిఐ శ్రేణులు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మానుకోట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగర వెయ్యాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు బలరాం నాయక్ గెలుపుకై ప్రతి కార్యకర్త సైనికుడు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కరణం రాజన్న, నెల్లూరు నాగేశ్వరావు, బుర్ర సమ్మయ్య కన్నె వెంకన్నలు తదితరులు పాల్గొన్నారు.



# దుర్గ గుడిలో పూజలు చేసిన తీన్మార్ మల్లన్న

**చిట్యాల, విశాలభారతి:** నల్లగొండ ఖమ్మం వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నల్లగొండలో నామినేషన్ వేయడానికి వెళ్తున్న సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తో కలసి చిట్యాలలోని శ్రీశ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ర్యాలీగా నల్లగొండకు బయలు దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి,గుడిపాటి లక్ష్మీనరసింహ, కాటం వెంకన్న, ఎద్దులపురి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలలో హోమ్ ఓటింగ్ పూర్తి

- తహసీల్దార్ సూర్య నారాయణ



**పినపాక, విశాలభారతి :** లోక్‌సభ ఎన్నికలకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే ప్రక్రియను ఎన్నికల అధికారులు శుక్రవారం ప్రారంభించారు. పినపాక మండలంలో హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటింగ్ పూర్తి చేస్తున్నామని తాసిల్దార్ సూర్యనారాయణ తెలియజేశారు. హోం ఓటింగ్‌కు 2 బృందాలు, ఎన్నికల అధికారులు విభజించారన్నారు. ఒక్కో బృందంలో పోలింగ్ అధికారులతోపాటు వీడియో చిత్రీకరణ బృందం కూడా ఉంటుందన్నారు. హోంఓటింగ్‌కు 13 మంది దరఖాస్తు చేసుకోగా 12 మంది వినియోగించుకున్నారని తెలియజేశారు. ఒకరు మరణించినట్లుగా తెలియజేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారమే హోమ్ ఓటింగ్ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు వీరభద్రం, బాలకృష్ణ, ఏపీవో జ్యోతి, అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రెవిన్యూ సిబ్బంది, బిఎల్వోలు పాల్గొన్నారు.

# నిప్పు అంటుకొని ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



**సిరికొండ, విశాల భారతి** సిరికొండ మండలం పెద్ద వాల్గొట్ గ్రామానికి చెందిన కిషన్ అనే వ్యక్తి తన పొలం లో వున్న గడ్డికి నిప్పు పెట్టడానికి వెళ్లి తానే నిప్పుకు ఆహుతి ఐన ఘటన పెద్ద వాల్గొట్ లో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే..సిరికొండ మండల ఎస్ ఐ రమేష్ అందించిన వివరాల ప్రకారం పెద్ద వాల్గొట్ గ్రామానికి చెందిన కిషన్ ( 35) వృత్తి వ్యవసాయం. ఈయనకు కౌశిక్ (11 ) సంవత్సరాలు, హర్షిని (14) సంవత్సరాల పిల్లలు వున్నారని, కిషన్ కు పోత్నూర్ శివారులో పొలంవుందని, ఆ పొలాన్ని గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కోశారని, అనంతరం పొలంలో వున్నా గడ్డికి అగ్గిపెట్టి వస్తానని వెళ్లాడని రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో రాత్రి అతని భార్య లత పొలందగ్గరికి వెళ్లి వెతకగా అక్కడ కనిపించక పోవడంతో బంధువులను, తెలిసినవాళ్ళను అడిగిన ఎక్కడ కూడా తనభర్త ఆచూకీ తెలియలేదని, మరల శుక్రవారం ప్రొద్దున 7 గంటలకు వెళ్లి తన పొలంవద్ద వెతకగా తన భర్త కిషన్ కాలిపోయి పొలంలో పడి ఉన్నాడని, తన భర్తకు కాళ్ళ నొప్పులు ఉండటం వల్ల నడవలేదని, కర్రపట్టుకొని నడుస్తాడని, కంటి చూపు కూడా మందగించిందని, పొలంలో ఉన్న గడ్డికి నిప్పు పెట్టబోయి ఆ నిప్పులో ప్రమాదవశాత్తు నా భర్త కాలిపోయి మరణించినాడని మృతుని భార్య ఈ మరణానిపై ఎటువంటి అనుమానం ఎవరిపైన లేదని దరఖాస్తు రూపంలో తెలిపిందని ఎస్సై తెలిపారు.



# బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

**నారాయణఖేడ్, విశాల భారతి** నారాయణఖేడ్ మండల్ కొండపూర్ తండా ఎంపీటీసీ రాజు నాయక్ జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, రాష్ట్ర యూత్ ప్రధానకార్యదర్శి రాకేష్ షేట్కార్, పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్, పీసీసీ సభ్యులు శంకరాయస్వామి, ఖేడ్ ఇంచార్జి శశికళ యాదవ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, బంజారా నాయకులు రమేష్ చౌహన్,మాలశెట్టి యాదవ్, కిసాన్ నాయక్ తదితరులు ఉన్నారు.



# బీజేపీలోకి బారి చేరికలు

**సిరికొండ, విశాల భారతి** సిరికొండ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ బరిగేలా సంతోష్, కనకట్ల రమేష్, రాజు, మహేష్, భారత్, వినోద్ లు రూరల్ ఇంచార్జి దినేష్ కులాచారి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. వీరిని కులాచారి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల బీజేపీ కార్యకర్తలు పాలుగోన్నారు.



# ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదాయం, ఖర్చులు వివరాల వెల్లడి

**సిరికొండ, విశాల భారతి** సిరికొండ మండలములోని 9 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో ఉన్న శ్రీ లొంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో గత సంవత్సరం నుండి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ అన్న సత్ర కార్యక్రమాన్ని చేపట్టి, సంవత్సరం పూర్తయినందున ఆలయ కమిటీ సభ్యులు భక్తులు ఇచ్చిన విరాళాల మొత్తం గ్రామ ప్రజలకు తెలియ చేసారు.

**మొత్తం విరాళముల నగదు..**

1. రూపాయలు: 1,86,614/

మొత్తం ఖర్చు నగదు..

2. రూపాయలు: 1,34,425/

మిగిలిన నగదు

3. రూపాయలు : 52,189/

4. (మొత్తం బియ్యం విరాళములు (4 క్వింటాళ్ళు)

ఈ అన్న సత్రము కార్యక్రమము పూర్తి పారదర్శకతతో ఆలయ అభివృద్ధి కమిటి ఆధ్వర్యములో నిర్వహించారని,అన్న సత్రము కార్యక్రమము నందు పాల్గొన్న దాతలకు, సేవకులకు, భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటి తరుపున పేరు పేరున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ అన్న సత్రమును నిత్యాన్న సత్రముగా మార్చుటకు ఆలయ అభివృద్ధి కమిటి వారు విశేష కృషి చేయుచున్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు



**నారాయణఖేడ్ విశాల భారతి** నారాయణఖేడ్ మండల్ పిప్రి, ఇశ్రా నాయక్ తండా బిఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ చందర్ నాయక్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కార్ ఆధ్వర్యంలో నెహ్రు నాయక్, గోపాల్, శివరాం, జైపాల్, వసరం, తులషిరం, లక్ష్మాన్, హేమ్లా నాయక్, జైపాల్ నాయక్, దేవుసింగ్ నాయక్, భీమ్లా నాయక్, సంగ్రామా నాయక్, హరిషింగ్ నాయక్, కిసాన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు శంకరయ్య స్వామి. వారితో విట్టల్, నెహ్రు, భూపాల్, కలరు.

# కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం

- కేసీఆర్ ను గద్దె దించాం.. మోదీని దించుతాం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి విశాల భారతి** తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పార్లమెంట్ ఎన్నికల్లోను కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తిలోని మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ నివాసంలో నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్ తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. నీళ్లు నిధులు నియామకాలు లక్ష్యంగా మిగులు బడ్జెట్ తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబ అహంకార పాలనతో సుమారు ఆరున్నర లక్షల కోట్ల అప్పుల పాలు చేయడం జరిగిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీని ఓడించి కేసీఆర్ ను ఇంటికి పంపించిన మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోడీని ఇంటికి పంపించనున్నట్లు కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఉత్తర భారత దేశంలో బిజెపి పార్టీకి గణనీయంగా సీట్లు తగ్గనున్నట్లు దక్షిణ భారతదేశంలో సీట్లు రాకుండా కాంగ్రెస్ నాయకత్వంలో మరింత కృత నిశ్చయంతో పని చేస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మూడు దశాబ్దల క్రితం ప్రారంభమైనా నేటికి చివరి ఆయకట్టు వరకు నీరు అందించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి మాజీ ఎంపీ కాంగ్రెస్ సీనియర్ నేత కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా మరోసారి మల్లురవి పోటీ చేస్తున్న క్రమంలో మల్లు రవిని బంపర్ మెజార్టీతో గెలిపించుకుని కల్వకుర్తి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రేవంత్ రెడ్డికి జాతీయ కాంగ్రెస్లో జాతీయ కాంగ్రెస్ లో మరింత ప్రాధాన్యం పెరుగుతుందని అన్నారు. అనంతరం మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ మల్లు రవి ఎంపీగా తాను మంత్రిగా కల్వకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు.

**పదేళ్ల కెసిఆర్ పాలనలో అవినీతి కుంభకోణాలే:** పదేళ్ల కేసీఆర్ పాలనలో కుటుంబ అవినీతి కుంభకోణాలతో మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అతలాకుతలం చేయడం జరిగిందని నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్ విమర్శించారు. కెసిఆర్ బాత్రూంలో జారి పడినట్లు తెలంగాణ ప్రజలను నమ్మించి డ్రామాలాడే ప్రయత్నం చేయడం జరిగిందని ఆయన డ్రామాలను తెలంగాణ సమాజం నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సమక్షంలో ఆయా పార్టీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# బీజేవైఎం యువ మోర్చా మండల కన్వీనర్ గా కొప్పుల శివ



**కల్వకుర్తి విశాల భారతి** కల్వకుర్తి మండలం జిలేళ్ళ గ్రామానికి చెందిన కొప్పుల శివ కల్వకుర్తి బీజేవైఎం యువ మోర్చా మండల కన్వీనర్ గా నియమితులయ్యారు. కొప్పుల శివ గతంలో బీజేవైఎంలో పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు పార్టీలో క్రియాశీలక పాత్రను పోషించడం పట్ల బీజేవైఎం యువ మోర్చా మండల కన్వీనర్ గా నియమించారు. ఈ సందర్భంగా కొప్పుల శివ మాట్లాడుతూ.. నా నియామకానికి సహకరించిన జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు గ్రామ గ్రామాన పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.



# హోమ్ ఓటింగ్ సద్వినియోగం చేసుకోవాలి

**వనపర్తి విశాల భారతి:** పోలింగ్ కేంద్రాలకు వెళ్ళలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, వయోవృద్ధులకు తమ ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించినందుకు సంబరపడుతున్నారు. 85 సంవత్సరాల వయస్సు పైబడిన వారు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వెళ్ళలేని వారికి ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ అవకాశం కల్పించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హోమ్ ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ హోమ్ ఓటింగ్ నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లాలో మే, 3వ తేది నుండి హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం అయింది. శుక్రవారం నుండి ప్రారంభమైన ఈ ప్రక్రియ మే 8వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంది. హోమ్ ఓటింగ్ కు మొత్తం 269 మంది ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ సజావుగా ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద లాల్ పవార్ మొత్తం 8 పోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి హోమ్ ఓటింగ్ కలిగి ఉన్న 7 మండలాల్లో ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి ఓటు వేయించే విధంగా రోజు వారి రూట్ మ్యాప్ లను సిద్ధం చేయించారు. మే 3 నుండి మే 8 వరకు హోమ్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. శుక్రవారం ఉదయం వనపర్తి పట్టణంలోని గాంధీ నగర్ వార్డు నెంబర్ 18 లో నివాసముంటున్న మాధవి భర్త పేరు శివాజీ దివ్యాంగురాలు హోమ్ ఓటింగ్ సిబ్బంది తన ఇంటి వద్దకు వచ్చి ఓటు వేయించుకొని పోవడం పై సంతోషాన్ని వెలిబుచ్చారు. తాను నడవలేనని కనీసం కుర్చీలో సైతం కుర్చోలేనని అన్నారు. తనకు ఓటు ఉన్నా ఓటు వేయాలని బాధ పడేదనీ కానీ ఎన్నికల కమిషన్, జిల్లా యంత్రాంగం చొరవతో ఈ రోజు నాకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేశానని సంతోషం వ్యక్తం చేశారు.



# పద్మశాలీల ముఖ్య నాయకులు కాంగ్రెస్ చేరిక

**ఆర్మూర్,విశాల భారతి** శుక్రవారం ఆర్మూర్ పట్టణ పద్మశాలీల ముఖ్య నాయకులు మాజీ కౌన్సిలర్ గుద్దేటి రమేష్ , ఆర్మూర్ పట్టణ పద్మశాలీల సంఘం(8 తర్పల) అధ్యక్షులు అంబల్ల శ్రీనివాస్ , మాజీ వార్డు సభ్యులు (8 తర్పల) అధ్యక్షులు గుద్దేటి డిష్ రాము ,ఆర్మూర్ నియోజకవర్గ పద్మశాలీల సంఘం అధ్యక్షులు దాసరి అనిల్, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ విప్ అనిల్ ఈరవత్రి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ పండిత్ వినిత పవన్ , ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ ,కౌన్సిలర్లు శాల ప్రసాద్ ,కొంత మురళి , ఆర్మూర్ మాజీ సర్పంచ్ సదాశివ్ ,మాజి కౌన్సిలర్ మహమూద్ అలీ ,ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు జిమ్మి రవి ,అజ్జు బాయ్ ,రాజు భాయ్ ,చిట్టి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ విక్రమ్



**ధర్పల్లి విశాల భారతి:**ధర్పల్లి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ మాత ఆలయం వద్ద శుక్రవారం ఉదయం ఎస్ ఐ విక్రమ్ తమ సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ విక్రమ్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడుపారాదని, వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ప్రయాణంలో హెల్మెట్ ధరించాలని, ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున తెలంగాణాలో ఏమైనా నగదు బదిలీలు జరుగుతున్న సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని అన్నారు. ఎస్సై తో పాటు సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ ను బద్నాం చేయడమే కాంగ్రెస్ పని

- జిల్లాల రద్దు..అప్రజాస్వామ్యకం

**వనపర్తి విశాల భారతి:** తెలంగాణ ఏర్పాటుకు ముందు గత పాలకులు ముందు చూపు లేక ఉమ్మడి జిల్లాలతో కొనసాగించిన పరిపాలనతో కొన్ని ఏండ్ల పాటు ప్రజలు హరిగోశపడ్డారని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆత్మబలిజనాలతో తెచ్చుకున్న తెలంగాణలో తెలంగాణలో ఆవిర్భవించుకొని ఉమ్మడి జిల్లాలలో సేవలు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నాయని ప్రజలకు సుపరిపాలన అందించడం కోసం కెసిఆర్ ప్రభుత్వం చేసిన వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. జరిగిన అభివృద్ధి చూసి ఓర్వలేని కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీని బద్నాం చేయడమే పనిగా పెట్టుకుందని ఆయన అన్నారు. అధికారం వచ్చిన 100 రోజుల్లో ప్రజా సమస్యలతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తానని అబద్ధపు మాటలతో అందలం ఎక్కిన కాంగ్రెస్ పార్టీ ఏమి చేయలేని పరిస్థితిలో జిల్లాలను రద్దు చేసే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అమలుకు, ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని చిత్తశుద్ధి ఉంటే హామీలు అమలు చేసి ఓటు అడగాలని డిమాండ్ చేశారు. జిల్లాల రద్దుపై ముఖ్యమంత్రి స్పందించాలని లేకుంటే ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పోడు , కౌలు రైతులకు కె.సి.ఆర్ 4లక్షల 50వేల ఎకరాలకు పట్టాలు ఇచ్చి హక్కులు కలిపించిందని వారికి రైతు బంధు ఈ ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికలలో ఆలోచించి కెసిఆర్ ఆశీర్వదించిన ప్రవీణ్ కుమార్ నీ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జడ్పిటిసి రఘుపతిరెడ్డి, లక్ష్మరెడ్డి,మన్నేపు రెడ్డి, నందిమల్ల అశోక్ పాల్గొన్నారు.



# రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల తరలింపు

**వనపర్తి విశాల భారతి:**నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు పోటీలో నిలిచినందున అదనంగా 380 బ్యాలట్ యూనిట్లను ర్యాండమైజేషన్ పూర్తి చేసి వనపర్తి సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈ .వి.యం గోదాం నుండి రాజకీయ పార్టీల ప్రతినిదుల సమక్షంలో అదనపు బ్యాలట్ యూనిట్లను క్లోజ్డ్ కంటైనర్ లో పోలీస్ భద్రతతో చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్ కు తరలించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానానికి 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో అదనపు బ్యాలట్ యూనిట్ లు పెట్టవలసిన అవసరం ఏర్పడిందని తెలిపారు. జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి యం. నగేష్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, భాజపా ప్రతినిధులు దాసరాజు ప్రవీణ్, సీపీఎం ప్రతినిధి పరమేశ్వరాచారి, తెదేపా ప్రతినిధి శంకర్, బీఆర్ఎస్ ప్రతినిధి జమీల్ తదితరులు ఉన్నారు.



# ఎన్నికల నియమావళి పై అవగాహన

**సూర్యాపేట, విశాలభారతి:** ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట రూరల్ ఎస్ ఐ బాలునాయక్ సూర్యాపేట మండల పరిధిలోని బాలెంల గ్రామం లో శుక్రవారం పోలీసు కళాభృందం అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. మహిళల, విద్యార్థుల రక్షణ, చట్టాలు, విద్యా విధానాలు, సమస్యలను అధిగమించడం, సోషల్ మీడియా, ఇంటర్నెట్ సద్వినియోగం లాంటి అంశాలపై మరియు విద్యార్థులు ఒత్తిడి అధిగమించి లక్ష్యాలను చేరుకోవాలి, లక్ష్యం కోసం కృషి చేయాలని పోలీస్ కళాబృందం సభ్యులు పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ మాట్లాడుతూ జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ గారి అధ్వర్యంలో మహిళల రక్షణపై పటిష్టంగా పని చేస్తున్నామని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా పరిష్కారం చేసుకోవాలి చట్టాలను చేతుల్లోకి తీసుకోకుండా వాటిని గౌరవించి పోలీస్ వారికి తెలియజేశారు. కార్యక్రమంలో నందు పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ రవి ,హోంగార్డ్ శ్రీనివాస్ కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపి, క్రిష్ణ,చారి, గురులింగం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కన్నప్ప షూట్ పూర్తి చేసిన అక్షయ్ కుమార్



డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'లో దిగ్గజ నటులు భాగస్వామ్యం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌లో డా.మోహన బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రభాస్, బ్రహ్మానందం వంటి వారు నటిస్తున్నారు. రీసెంట్‌గా బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ కూడా షూటింగ్‌లో జాయిన్ అయిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా అక్షయ్ కుమార్ తన సీన్లకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేశారు. ఈ మేరకు అక్షయ్ కుమార్‌తో పని చేసిన ఎక్స్‌పీరియెన్స్ గురించి విష్ణు మంచు తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. మహాశివరాత్రి పర్వదినాన విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కు విశేష స్పందన లభించిన సంగతి తెలిసిందే. ప్రతీ ఒక్క అప్డేట్‌తో కన్నప్ప మీద అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. అనేక మంది పాన్ ఇండియా స్టార్స్ ఉండటం వల్ల అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్ మీద పడింది. అక్షయ్ కుమార్ కొద్ది రోజుల క్రితం కన్నప్ప షూటింగ్‌లో జాయిన్ అయిన సంగతి తెలిసిందే. అక్షయ్ కుమార్ తన షూటింగ్‌ను ముగించుకున్నాడు. విష్ణు మంచు ఈ మేరకు వేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. 'అక్షయ్‌కుమార్ గారితో పని చేయడం ఆనందంగా ఉంది. ఆయన్నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైంది. ఇంకా ఇలా ఎన్నో సార్లు కలవాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. "కన్నప్ప" సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చే విజువల్ వండర్‌గా రాబోతోంది. ధైర్యవంతుడైన యోధుడు శివుని భక్తుడైన కన్నప్ప కథను అద్భుతంగా మల్చుతున్నారు. కన్నప్ప అచంచలమైన విశ్వాసం తరతరాలుగా అందరికీ స్ఫూర్తినిస్తూ ఉంది. ఎంతో అంకితభావంతో విష్ణు మంచు ఈ పాత్రను పోషిస్తున్నారు. మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. త్వరలోనే పూర్తి చేసి ప్రమోషన్ కార్యక్రమాలను పెంచనున్నారు.

# ధనుష్-శేఖర్ కమ్ముల 'కుబేర' కింగ్ నాగార్జున ఫస్ట్ లుక్



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడుగా.. నేషనల్ అవార్డు విన్నర్, సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల రూపొందిస్తున్న సోషల్ డ్రామా 'కుబేర'. మైథలాజికల్ పాన్ ఇండియన్ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాలో టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కింగ్ నాగార్జున ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రివీల్ చేశారు. స్టార్ స్పోర్ట్స్ వేదికగా IPL 2024 ప్రసారం మధ్యలో విడుదల చేసిన నాగార్జున ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది. సన్ రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ IPL గేమ్ సమయంలో కింగ్ నాగార్జున ఫస్ట్ లుక్‌ను టెలికాస్ట్ చేశారు. ఈ ఇంటెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో వర్షం పడుతుండగా గొడుగు పట్టుకుని కళ్లద్దాలు పెట్టుకుని మ్యాన్లీగా కనిపించారు కింగ్ అక్కినేని నాగార్జున. కుబేర నుండి మహాశివరాత్రి సందర్భంగా విడుదల చేసిన తమిళ స్టార్ హీరో ధనుష్ ఫస్ట్ లుక్‌కి దేశవ్యాప్తంగా ప్రేక్షకుల నుండి థ్రిల్లింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో ధనుష్, కింగ్ నాగార్జున అక్కినేని, రష్మిక మందన్న, జిమ్ సర్భ్‌తో పాటు భారీ తారాగణం నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఏకకాలంలో తమిళం, తెలుగు, హిందీ భాషల్లో చిత్రీకరిస్తున్నారు.

# నేడు "గం..గం..గణేశా" సెకండ్ సింగిల్



"బేబి" వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకుల ముందుకొస్తున్న సినిమా "గం..గం..గణేశా". ఈ సినిమాను హైలైఫ్ ఎంటర్ టైన్ మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ దేవరకొండ తన కెరీర్ లో చేస్తున్న ఫస్ట్ యాక్షన్ మూవీ ఇది కావడం విశేషం. ఈ నెల 31న "గం..గం..గణేశా" సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. రేపు మధ్యాహ్నం 12.06 నిమిషాలకు "గం..గం..గణేశా" సెకండ్ సింగిల్ 'పిచ్చిగా నచ్చావే' ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. హీరో హీరోయిన్లు ఆనంద్ దేవరకొండ, ప్రగతి శ్రీవాస్తవ మధ్య రొమాంటిక్ లవ్ సాంగ్ గా ఈ పాట రూపొందించారు. ఈ సమ్మర్ లో టాలీవుడ్ నుంచి వస్తున్న ఇంట్రెస్టింగ్ మూవీగా "గం..గం..గణేశా" పై అంచనాలు ఏర్పడుతున్నాయి.



# నా బాడీ సూపర్‌డీలక్స్ అంటున్న ఆషురెడ్డి

రోటిన్ పాత్రలకు భిన్నంగా కొత్త పాత్రల్లో నటించినప్పుడే కెరీర్‌లో కిక్ వుంటుంది. సరిగ్గా అలాంటి ఓ డిఫరెంట్ అండ్ బోల్డ్, హాట్ పాత్రలో త్వరలో యేవమ్ చిత్రంలో కనిపించబోతున్నారు ఆషు రెడ్డి. హారిక అనే ముఖ్యపాత్రలో ఆమె నటిస్తున్న చిత్రం యేవమ్.. ఈ చిత్రంలోని నా బాడీ సూపర్‌డీలక్స్ అంటూ ఆషురెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారు తెలియాలంటే యేవమ్ విడుదల వరకు ఆగాల్సిందే. చాందిని చైదరి, వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రకాష్ దంతులూరి దర్శకుడు. నవదీప్, పవన్ గోపరాజు నిర్మాతలు. శుక్రవారం ఆషు రెడ్డి పాత్రకు సంబంధించిన లుక్‌ను విడుదల చేశారు మేకర్స్ మహిళా సాధికారికతను చాటి చెప్పే నేపథ్యంలో ఈ సినిమా వుంటుంది. దర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ ఇటీవల విడుదల చేసిన చాందిని చౌదరి పోస్టర్‌లో వున్న 'ఆడపిల్లని అయితే ఏంటంటా? అనే రైటప్ అందర్ని ఆలోచింపజేసింది. ఇప్పుడు ఆషు రెడ్డి నా బాడీ సూపర్ డీలక్స్ అని ఎందుకు అంటుంది. ఇలా ప్రతి పాత్రకు ఒక మార్క్ వుంటుంది. కొత్త కంటెంట్‌తో పాటు ఎంతో డిఫరెంట్ నేరేషన్‌తో ఈ సినిమా వుంటుంది. తప్పకుండా చిత్రం అందరికి నచ్చుతుందనే నమ్మకం వుంది' అన్నారు.



# 10న లక్ష్మీ కటాక్షం

మహతి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ నుండి యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కే. పురుషోత్తం రెడ్డి నిర్మించిన 'లక్ష్మీ కటాక్షం' డైలాగ్ పోస్టర్ & ట్రైలర్ విడుదల అయ్యి ప్రేక్షకుల నుండి విశేష ఆదరణ పొందిన సంగతి అందరికీ తెలిసిందే. పొలిటికల్ సేటైరికల్ డ్రామా తో వచ్చిన ఈ 'లక్ష్మీ కటాక్షం' కాన్సెప్ట్ తనకంటూ ఒక మార్క్ క్రీయేట్ చేసుకుంది. ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు ఫిక్స్ చేసుకుని నాయకులని ముప్పు తిప్పలు పెడుతూ డ్రామా తో పాటు, హాస్యం రెండు కలగలిపిన కథ 'లక్ష్మీ కటాక్షం'. ఒక పక్క రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నికల హోరు ఇంకో పక్క ఆ ఎన్నికలకే సెటైరికల్ గా వస్తున్న 'లక్ష్మీ కటాక్షం' U/A సర్టిఫికెటును తెచ్చుకొని మే 10న థియేటర్లలో రిలీజ్ కాబోతుంది.



# ఏ ఔట్ ఫిట్ లోనైనా అదుర్స్!

బుల్లితెర యాంకర్ శ్రీముఖికి ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. తన అందం, చలాకీతనంతో యువతను బాగా ఆకట్టుకుంటోంది. టెలివిజన్ టాప్ యాంకర్స్ లో ఒకరిగా వరుస టీవీ షోలతో అలరిస్తోంది. స్మాల్ స్క్రీన్ పై సందడి చేస్తూ తన అభిమానులు, ఆడియన్స్ ను ఫుల్ ఖుషీ చేస్తోంది.ప్రజెంట్ స్టార్ మా, జీ తెలుగు ఛానల్స్ లో టీవీ షోలకు యాంకరింగ్ చేస్తూ బిజీగా గడుపుతోంది. ఓవైపు యాంకరింగ్ చేస్తూ.. మరోవైపు సినిమాల్లో కూడా నటిస్తోంది శ్రీముఖి. కెరీర్ విషయంలో ఎంత బిజీగా ఉన్నా.. సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటోంది. బ్యూటిఫుల్ ఫోటో షూట్స్ తో సందడి చేస్తుంటోంది. ఎప్పటికప్పుడు తన గురించి అప్డేట్స్ ఇస్తూనే ఉంటోంది. అందులోనూ ప్రత్యేకమైన రోజు, పండుగ వేళల్లో మరింత స్పెషల్ గా రెడీ అయ్యి తన అందంతో ఆకట్టుకుంటోంది. అందం అప్పడప్పుడు ట్రెండీ వేర్ లో స్టన్నింగ్ పోజులు ఇచ్చి షాక్ ఇస్తుంటోంది శ్రీముఖి. తాజాగా ట్రెడిషనల్ వేర్ లో దిగిన ఫోటోలు షేర్ చేసింది. గ్రే కలర్ వన్ మినిట్ శారీలో అందాలు ఆరబోసింది. పైటను పట్టుకుని పోజులు ఇచ్చింది. రకరకాల స్టిల్స్ లో అదరగొట్టేసింది. ఓర చూపులతో కుర్రకారు దృష్టిని తన వైపు తిప్పుకుంది. చెప్పాలంటే.. డైమండ్ సెట్, పాపిట చైన్ శ్రీముఖి అందాన్ని మరింత పెంచాయి. ప్రస్తుతం శ్రీముఖి పిక్స్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. సొగసైన పోజులు అదిరిపోయాయని కామెంట్లు పెడుతున్నారు. డ్రెస్సింగ్ కంటే చూపులతో ఫ్లాట్ చేస్తోందని అంటున్నారు. యాంకరింగ్ తో సిల్వర్ స్క్రీన్ పై, అందంతో నెట్టింట శ్రీముఖ జోరు వేరే లెవల్ లో ఉందని చెబుతున్నారు. మొత్తానికి అమ్మడిని ప్రశంసలతో ఆకాశానికెత్తేస్తున్నారు. సింప్లీ సూపర్బ్ అని కొనియాడుతున్నారు. సినిమాల విషయానికొస్తే.. ఆ మధ్య మెగాస్టార్ చిరంజీవి భోళాశంకర్ మూవీలో యాక్ట్ చేసింది శ్రీముఖి. కానీ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయింది. ఇప్పుడు మరో చిత్రంలో ఛాన్స్ కొట్టేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. చిరంజీవి విశ్వంభరలో శ్రీముఖి నటిస్తుందని టాక్ వస్తోంది. మెగాస్టార్ తో కలిసి మాస్ స్టెప్పులు కూడా శ్రీముఖి వేయనుందని తెలుస్తోంది. మరి ఇందులో నిజమెంతో తెలియదు.

# 'దేవకీ నందన వాసుదేవ' ఫస్ట్ సింగిల్ విడుదల



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా తన రెండవ చిత్రం 'దేవకి నందన వాసుదేవ' లో మాస్, యాక్షన్‌ప్యాక్డ్ పాత్రలో కనిపించనున్నారు. గుణ 369 ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆధ్యాత్మిక అంశాలతో కూడిన ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్. హనుమాన్ ఫేమ్ క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాస్తున్నారు. లలితాంబిక ప్రొడక్షన్స్‌లో ప్రొడక్షన్ నెం. 1గా ఎన్ఆర్ఐ (ఫిలిం డిస్ట్రిబ్యూటర్) సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నల్లపనేని యామిని సమర్పిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ ఏమయ్యిందే ప్రోమోతో టీజ్ చేసిన తర్వాత, మేకర్స్ ఈ రోజు లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఆదిత్య మ్యూజిక్ లేబుల్ ద్వారా ఈ పాట మార్కెట్ లోకి రిలీజ్ అయ్యింది. భీమ్స్ సిసిరోలియో ఫుట్ టాపింగ్ బీట్‌లతో మ్యాజికల్ మెలోడీని అందించారు. సురేష్ గంగుల రాసిన ఈ పాట హీరోయిన్ పై హీరోకి వున్న ప్రేమని చాలా అందంగా అద్భుతంగా చూపించింది. ఈశ్వర్ దాతు వాయిస్ ప్రత్యేకంగా నిలిచింది. లిరిక్స్ మరింత అద్భుతంగా అలపించారు. అశోక్ గల్లా ఆనందంగా కనిపించారు. అతని డ్యాన్స్ కూల్ గా ఉన్నాయి. లవ్ ట్రాక్ అందంగా ఉంది, పాటలో వారి కెమిస్ట్రీ ప్లజెంట్ గా వుంది. రసూల్ ఎల్లోర్ తీసిన విజువల్స్ చాలా రిఫ్రెష్‌గా ఉన్నాయి. ఏమయ్యిందే ఇన్స్టంట్ హిట్.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.